RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి  సంపుటి : 3  సంచిక : 107  మంగళవారం 13 మే 2025  పేజీలు : 4

### మోదీపై చిదంబరం థరూర్ ప్రశంసలు

న్యూఢిల్లీ : పాకిస్థాన్ విషయంలో ప్రధాని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలకు ఊహించని వర్గాల నుంచి కూడా మద్దతు వెల్లువె త్తుతోంది. పహల్గాం ఉగ్రదాడిపై భారత సైన్యం ప్రతిస్పందనను ఎంచుకున్న లక్ష్యాల వరకే పరిమితం చేయడం చాలా తెలివైన ని ర్ణయమని కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ కాల్పుల విరమణ నిర్ణయాన్ని ఆయన సమర్థించారు. విస్తృత యుద్ధం వల్ల కలిగే ముప్పును మోదీ గుర్తించారన్నారు. మరిన్ని ప్రాణాలు పోకుండా నివారించేందుకు ఇది అవసరమైన నిర్ణయమని పేర్కొన్నారు. పరిస్థితి మరింత తీవ్రంగా మారకుండా మోదీ తెలివిగా నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు.'ఇది బాధిత దేశం చట్టబద్ధమైన ప్రతిస్పందన' అని చిదంబరం పేర్కొన్నారు. సరిహద్దు అవతలి నుంచి కాల్పుల వల్ల కొందరు భారతీయుల ప్రాణాలు పోవడం బాధాకరమంటూ ఆయన విచారం వ్యక్తం చేశారు.

## ఉగ్రవాదులు కలలో కూడా ఊహించని దెబ్బ కొట్టాం..


# సైన్యానికి సెల్యూట్

## ఆపరేషన్ సిందూర్‌పై జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ




దిల్లీ: ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనంత దారుణంగా మన సైన్యం వారిని దెబ్బతీసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సైనికుల పరాక్రమం, సాహసాలకు సెల్యూట్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఆయన తొలిసారి జాతినుద్దేశించి ప్రసంగించారు. "గడిచిన నాలుగు రోజులుగా భారత సైన్యం సామర్థ్యాన్ని, సంయమనాన్ని చూస్తున్నాం. నిఘా వర్గాల సామర్థ్యం, శాస్త్రసాంకేతిక సామర్థ్యాన్ని దేశం చూసింది. మన దేశం అసమాన వీరత్వాన్ని ప్రదర్శించింది. సైన్యం సాహసం, పరాక్రమాన్ని దేశం చూసింది. భారత రక్షణ దళాలు చూసిన ధైర్య సాహసాలు దేశానికి తలమానికం. పహల్గాంలో ఉగ్రవాదులు మతం పేరి అడిగి మరీ కుటుంబ సభ్యుల ముందు కాల్చి చంపారు. ఈ ఉగ్రదాడితో దేశమంతా నివ్వెరపోయింది. ఉగ్రవాద దాడులపై ప్రతి హృదయం జ్వలించింది" "పౌరులు, పార్టీలు అన్నీ ఏకతాటిపైకి వచ్చి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలబడ్డాయి. భారతీయ మహిళల నుదిటిపై సిందూరం తుడిచేసే వారికి ఎలాంటి బుద్ధి చెప్పాలో అదే ఆపరేషన్ సిందూర్. ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనంత దారుణంగా భారత్ దెబ్బతీసింది. ఉగ్రవాదుల శిబిరాలపై భారత మిసైళ్లు, డ్రోన్లు కచ్చితమైన లక్ష్యంతో దాడులు నిర్వహించాయి. బహావల్‌పుర్, మురుద్కే లాంటి తీవ్రవాద స్థావరాలపై దాడి చేసి భీతావహ పరిస్థితిని భారత్ సృష్టించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉగ్రవాదులు, ఉగ్రవాద సానుభూతిపరులకు ఏం చేస్తుందో భారత్ చెప్పింది. పాక్ గర్వంగా చెప్పుకొనే మిసైళ్లను ధ్వంసం చేశాం. పాకిస్థాన్ విమానాలు గాల్లోకి ఎగరలేని పరిస్థితిని భారత్ తీసుకొచ్చింది. భారత్ చర్యలకు బెంబేలెత్తిపోయిన పాకిస్థాన్ కాల్పుల విరమణకు ప్రపంచం మొత్తాన్ని వేడుకుంది. పాక్ డీజీఎంవో కాల్పుల విరమణ చర్చలకు పరిగెత్తుకుంటూ వచ్చారు" "ఎలాంటి దుస్సాహసానికి పాక్ తెగబడినా భారత్ దళాలు చావు దెబ్బ కొట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విస్పష్టంగా చెప్పాయి. ఉగ్రవాదంపై భారత్ షరతుల మేరకే చర్చలు ఉంటాయి. భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు సాగుతాయి. పాకిస్థాన్ అణు బ్లాక్‌మెయిలింగ్ ఇక సహించేది లేదు. అణుశక్తి, అణ్వాయుధాల ఆధారంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే, భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. ఉగ్రవాదం ఏ రూపంలో ఎక్కడ ఉన్నా భారత్ తుదముట్టించి తీరుతుంది" అని ప్రధాని మోదీ ప్రసంగించారు.

**ఆపరేషన్ సిందూర్.. దేశ వ్యాప్తంగా భాజపా 'తిరంగా యాత్ర'! :** పాకిస్థాన్ ఉగ్రమూకల పీచమణిచేందుకు భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడంతో భాజపా కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా తిరంగా యాత్ర పేరిట రేపట్నుంచి 11 రోజుల పాటు క్యాంపెయిన్ చేపట్టనుంది. మే 13న ప్రారంభం కానున్న ఈ తిరంగా యాత్ర ఈ నెల 23వరకు కొనసాగనుంది. ప్రధాని మోదీ నాయకత్వ పటిమ, సాయుధ దళాల పరాక్రమాన్ని ప్రజలకు వివరించేలా ఈ క్యాంపెయిన్ కొనసాగనుంది. తిరంగా యాత్ర నిర్వహణపై చర్చించేందుకు కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు పలువురు పార్టీ అగ్రనేతలు ఆదివారం సమావేశమయ్యారు. తాజాగా సోమవారం కూడా తరుణ్ చుగ్, వినోద్ తావ్డే, దుశ్యంత్ గౌతమ్‌లతో సమావేశమైన నడ్డా తుది కసరత్తు పూర్తి చేశారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత సైన్యం విజయవంతంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం నేపథ్యంలో చేపట్టబోయే ఈ క్యాంపెయిన్‌లో సమాజంలోని పలువురు ప్రముఖులతో పాటు ప్రజలను సమీకరించనున్నట్లు భాజపా నేతలు తెలిపారు. ఈ యాత్రలో పలువురు కేంద్రమంత్రులు, భాజపా నేతలు, కార్యకర్తలు పాల్గొననున్నారు.



### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

హైదరాబాద్: రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. భారత్–పాక్ ఉద్రిక్తతలు, దేశంలో జరిగిన పరిణామాల దృష్ట్యా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని పరిస్థితులను గవర్నర్‌కు ముఖ్యమంత్రి వివరించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

## మరో 12 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్!

హైదరాబాద్ : నిరుద్యోగ యువతకు తెలంగాణ ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పనుంది. పోలీసు శాఖలో 12 వేల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. కానిస్టేబుల్, ఎస్సై స్థాయిలో పలు ఖాళీలను భర్తీ చేయనుంది. పదవి విరణమ భర్తీలు కూడా.. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే నోటిఫికేషన్ రిలీజ్ చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం కానిస్టేబుల్, ఎస్సై స్థాయిలో 12 వేలకు పైగా పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేయనుండగా ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కూడా ఉంది. ఇక 2022లో చేపట్టిన నియామక ప్రక్రియలో ఎంపికై, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి 2024లో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నియామకపత్రాలు అందించిన విషయం తెలిసిందే.

కాగా ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచుతూ 2021 ఏప్రిల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2024 ఏప్రిల్ నుంచి ఉద్యోగ విరమణలు జరగగా.. వీటిని కూడా భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.




**మరో 30 వేల ఉద్యోగాలు..** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం జపాన్ లో చేపట్టిన పర్యటన ఈ రోజుతో ముగిసింది. సీఎం రేవంత్ టీమ్ రేపు హైదరాబాద్ కు తిరిగి రానుంది. ఈ పర్యటనలో మొత్తం రూ.12,062 కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడానికి ఒప్పందాలు జరిగాయి. దీంతో దాదాపు 30,500 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం జరిగింది. రూ.1,000 కోట్లు ప్రారంభ పెట్టుబడి కాగా రూ.5,000 కోట్ల పెట్టుబడుల అంచనా అని అధికారులు తెలిపారు. తద్వారా 30,000 ఉద్యోగాలు లభించనున్నట్లు చెప్పారు.



## పాక్‌ను పరుగులు పెట్టించిన ఇండియన్ ఆర్మీ!!

## మోదీయా... మజాకానా...!

## ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న భారత సర్కార్...

# యుద్ధ వ్యూహం

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ యుద్ధ వ్యూహాలపై తీవ్రమైన చర్చ సాగుతోంది. సమకాలీన అంతర్జాతీయ రాజకీయాలలో, గందరగోళ పరిస్థితుల నడుమ కూడా మోదీ చూపిస్తున్న స్థిరత, దూరదృష్టి విశేషమైనవిగా భావించబడుతున్నాయి. భారతదేశం భద్రత, ఆర్థిక వ్యవస్థ, విదేశాంగ విధానాల పరంగా సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ సంక్లిష్ట సమయంలో, ప్రధాని మోదీ తన వ్యూహాత్మక నిర్ణయాలలో గంభీరతను కనబరుస్తున్నారు. ముఖ్యంగా ఆయన్ని పరిశీలిస్తున్న రాజకీయ విశ్లేషకులు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారు ఎంత కఠినమైన సమయంలో అయినా ఆయన ముఖంపై ఆందోళనల చెమ్మచూపు కనిపించదు. ఇది ఆయన నేతృత్వశైలికి ప్రతీకగా నిలుస్తోంది. అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను బలంగా నిలిపే క్రమంలో మోదీ తీసుకుంటున్న చర్యలు యుద్ధ వ్యూహాలకు దారితీస్తున్నాయి. అమెరికా, రష్యా, యూరప్ వంటి పెద్ద దేశాలతో సఖ్యతను కొనసాగిస్తూ, మరోవైపు పొరుగుదేశాలపై అవసరమైన ఒత్తిడిని కూడా కొనసాగిస్తున్న తీరు గమనార్హం. ఇది శాంతిని కోరుకునే భారత్ వైఖరికి విరుద్ధంగా కాకుండా, అంతర్గత భద్రతను కాపాడుకునే మార్గంగా సాగుతుంది. మోదీ తన నిర్ణయాలను అత్యంత నిశితంగా తీసుకుంటారు. ఆయన్ను చూసి ఎవరికీ తడబాటు కలగదు ఎందుకంటే ఆయన్ను భయపెట్టే పరిస్థితులు, ఆయనను వణికించలేవు. దేశ ప్రయోజనాల పరంగా ఆయనే ఒక దృఢమైన నేత అని ఇప్పుడు ప్రపంచం అంగీకరిస్తోంది. ఈ నేపథ్యంలో, నరేంద్ర మోదీ యుద్ధ వ్యూహాలపై చర్చించడంలో ఉన్న సార్థకత ఏమిటంటే ఆయన్ని బలంగా, ఆత్మవిశ్వాసంతో చూస్తూ, దేశ భవిష్యత్తుపై మున్ముందు సన్నద్ధత కోసం తయారవ్వాలనే సందేశాన్ని ఇది ఇస్తోంది.

**కాంగ్రెస్ చేత కూడా జై కొట్టించుకుంటున్నారుగా మోడీ!...** దేశంలో ప్రధాని మోడీని అమితంగా ద్వేషించేవారు సైతం 'ఆపరేషన్ సింధూర్'తో ఇప్పుడు ఆయనకు జై కొట్టక తప్పని పరిస్థితి కల్పించారు. పహల్గాం దాడిని యావత్ దేశ ప్రజలు, రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ముక్త కంఠంతో ఖండించాయి. అది చాలా సహజం. కానీ ఆ తర్వాత 'సింధూ జలాల నిలిపివేత' వంటి మోడీ ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. కానీ 'ఆపరేషన్ సింధూర్'ని రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ముక్త కంఠంతో స్వాగతించాయి. అది ప్రధాని మోడీ సాహసోపేతమైన నిర్ణయాన్ని మెచ్చుకోవడమే అవుతుంది కనుక కొన్ని పార్టీలు స్పందించకుండా మౌనంగా ఉండిపోయాయి.

కానీ మెజారిటీ భారతీయులు 'ఆపరేషన్ సింధూర్'ని స్వాగతిస్తున్నారు. ముఖ్యంగా ఈ ఆపరేషన్‌కి 'సింధూర్' అని పేరుపెట్టడంతో దేశంలో మహిళలం దరూ ప్రధాని మోడీకి జేజేలు పలుకుతున్నారు. పహల్గాంలో భార్యల కళ్ళ ఎదుటే వారి భర్తలను ఉగ్రవాదులు కాల్చి చంపి వారి నుదుట బొట్టు చెరిపివేసినందున, మహిళల తరపున ప్రధాని మోడీ పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకున్నారని భావిస్తున్నారు. అత్యంత క్లిష్టమైన ఈ ఆపరేషన్ సింధూర్ గురించి ఆర్మీ, వాయుసేనకు చెందిన ఇద్దరు మహిళా అధికారులు కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ద్వారా మీడియాకు వివరింపజేయడం కూడా మోడీ, అమిత్ షాల తెలివితేటలకు మరో నిదర్శనం. తద్వారా భారతీయ మహిళల శక్తి సామర్థ్యాలు యావత్ ప్రపంచానికి చాటి చెప్పినట్లయింది. ఇది కూడా దేశంలో మహిళలు మోడీ ప్రభుత్వానికి జేజేలు పలికిస్తోంది.

ఇక ఈరోజు తెల్లవారుజాము నుంచి ఆపరేషన్ సింధూర్ గురించి మీడియా వర్ణిస్తున్న తీరు చూస్తుంటే, ప్రధాని మోడీయే స్వయంగా యుద్ధ విమానం నడిపించుకుంటూ పాకిస్థాన్‌లోకి వెళ్ళి ఉగ్రవాదులను మట్టుబెట్టి తిరిగి వచ్చారనట్లుంది. దేశ ప్రజలలో ఇంతగా దేశభక్తి, మోడీ పట్ల గౌరవం కనబడుతుంటే, ఈ పరిస్థితిలో ప్రజాభిప్రాయనికి వ్యతిరేకంగా మాట్లాడలేక, ప్రధాని మోడీని సమర్థించలేక ఆయన రాజకీయ శత్రువులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించినట్లయితే ప్రజలందరూ ప్రధాని మోడీని గెలిపించేందుకు బీజేపి, ఎన్డీఏ కూటమికే ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తారని వేరే చెప్పక్కరలేదు. కానీ ప్రస్తుతం ఎన్నికలు లేవని కాంగ్రెస్, బీజేపి వ్యతిరేక శక్తులు సంతోషపడాల్సిందే!

## సంపాదకీయం

# ప్రభుత్వం పిలక సైన్యం చేతిలో... సైన్యం పిలక ఉగ్రవాదుల చేతిలో! ఇదీ పాకిస్థాన్ దౌర్భాగ్యం

పాకిస్థాన్ ని ఒక దేశంగా చూడవచ్చా. గుర్తించి గౌరవించవచ్చా అన్న ప్రశ్నలు మేధావులు నిపుణుల నుంచి వస్తున్నాయి. పాకిస్థాన్ ని అంతర్జాతీయ సమాజం ఈ రోజుకీ ఒక దేశంగా చూస్తోంది. అందుకే చర్చలు శాంతి అని చెబుతోంది. రుణాలు కూడా ఇస్తోంది. తాజాగా దాదాపుగా 9 వేల కోట్ల పై చిలుకు రుణాలను పాకిస్థాన్ కి అంతర్జాతీయ ద్రవ్య నిధి మంజూరు చేసింది. దీంతో పాక్ తాత్కాలికంగా గండం గట్టెక్కినట్టే. ఇక చూస్తే కనుక పాకిస్థాన్ లో పేరుకు ప్రజాస్వామ్య ప్రభుత్వం నడుస్తోంది. అది బయటకు ఒక ముసుగు తప్ప మరేమీ కాదని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు చెబుతారు. సైన్యం మొత్తం అంతా తెర వెనక నుంచి నడిపిస్తోంది అని అంటారు. సైన్యానికి కోపం వస్తే చాలు ప్రధాని మారిపోతారు. ప్రభుత్వాలూ కూలిపోతాయి. మామూలుగా చూస్తే ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు ఎన్నుకున్న పాలకులే అత్యంత శక్తిమంతులు గా ఉంటారు. వారే వివిధ శాఖలలో నియామకాలను చేపడతారు. కానీ ఉల్టా సీదాగా పాక్ లో మాత్రం సైన్యం ప్రభుత్వాధినేతను ఎంపిక చేస్తుంది. తమ చెప్పుచేతలలో ఉండేవారినే తెచ్చి కీలుబొమ్మగా పీఠం మీద కూర్చోబెడుతుంది. ఎక్కడ తమ మాట వినరు అన్న సందేహం వచ్చినా వెంటనే ఆ బొమ్మను దించేస్తారు. మార్చి అవతల పెట్టేస్తారు. ఇక సైన్యం పాకిస్థాన్ లో అత్యంత బలమైంది. ఎన్నోసార్లు ప్రజా ప్రభుత్వాలను కూల్చేసి సైన్యాధ్యక్షులే దేశాన్ని నడిపిన చరిత్ర ఉంది. అంతే కాదు ప్రజాకర్షణ కలిగిన రాజకీయ నాయకులు తమకు గిట్టని వారు సొంత ఇమేజ్ ఉన్న వారు అధికారంలోకి ప్రజల మద్దతుతో వస్తారు అనుకుంటే అనూహ్యంగా వారి హత్యలు జరిగిపోతాయి. 1970 దశకంలో భుట్టో, అలాగే 2007న ఆయన కుమార్తె మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో ఇలాగే హత్య గావించబడ్డారు. అంతే కాదు పాక్ కి ప్రధానిగా చేసిన మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ లాంటి వారు జైలులో మగ్గుతున్నారు. ఇమ్రాన్ కి అత్యంత ప్రజాదరణ ఉంది. ఆయన మీద సరైన ఆధారాలు లేకుండా చిన్నపాటి ఆరోపణలతోనే జైలు పాలు చేశారు అన్న విమర్శలు ఉన్నాయి. ఇక అత్యంత శక్తివంతమైనది పాక్ సైన్యం అని చెబుతున్న వేళ వారి కంటే పాకిస్థాన్ లో ఉగ్రవాదులు ఇంకా శక్తిమంతులుగా ఉన్నారు. వారు చెప్పినట్లుగా సైన్యం అక్కడ అంతా చేయాల్సి ఉంటుంది. ఉగ్రవాదులు అంటే అరాచకమే తప్ప మరోటి ఉండదు. వారు అనుకున్నది చేస్తారు. జీహాదీ పేరుతో అమాయకులను చంపుతూంటారు. వారు సైన్యాన్ని తమ చెప్పుచేతలలో ఉంచుకుని ఆటాడిస్తూంటారు అని అంటారు. తాజాగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లో ఉగ్రవాద పోస్టులు అనేకం ద్వంశం అయ్యాయి. అలా చనిపోయిన ఉగ్రవాదులకు పాక్ సైన్యం ఘనమైన నివాళి అర్పించడం ప్రపంచం అంతా చూసింది. చాలా మంది ఉగ్రవాదులు గాయాలపాలు అయి ఆసుపత్రులలో ఉంటే వారిని పరామర్శించడానికి సైనిక అధికారులు వెళ్ళడమూ అంతా చూశారు. ఈ విధంగా ఒక బలమైన బంధం సైన్యం ఉగ్రవాదుల మధ్య పెనవేసుకుని పోయిన చోట ప్రభుత్వాలు నామమాత్రం అయిన చోట భారత్ లాంటి ప్రజాస్వామిక దేశాలు చర్చలు ఎవరితో జరపాలి అన్నది అంతర్జాతీయ దౌత్య నిపుణుల ప్రశ్న. నిజమే యుద్ధం అనివార్యం కాదు. ఎవరూ కోరుకోరు. శాంతి అందరికీ కావాలి. కానీ ఉగ్రవాదుల మాటే పూర్తిగా చెల్లుబాటు అయ్యే వాతావరణంలో ఉన్న పాక్ తో శాంతి చర్చలు అంటే చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లే అని అంటున్నారు. జీహాదీలకు శాంతి వచనాలు రుచించవు అంటారు. అన్నీ తెగించి బరితెగించిన వారికి చట్టాలు సరిహద్దులు కాల్పుల విరమణను పాటించడాలు అంతకంటే తెలియవు. వారికి తెలిసింది అన్నా జీహాదీ పేరుతో యుద్ధం. తాము చేస్తున్నది కరెక్ట్ అన్న ఉన్మాదంలో వారు ఉన్నారు. వారే ఇపుడు పాకిస్థాన్ అనబడే ఒక దేశాన్ని నియంత్రిస్తున్నారు. ఈ సంగతి అంతర్జాతీయ సమాజానికి తెలిసిన తమ అవసరాల కోసం పాక్ తో దోస్తీ చేస్తూ భారత్ ని చర్చలకు సిద్ధం కమ్మంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల మధ్య ఈ రోజు ఉన్న భారత్ పాక్ విషయంలో తేల్చుకోవాల్సింది చివరికి తానే అన్నది అర్థం అయింది. అందుకే ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్ర మూకలను ఏరేసింది. ఇపుడు కాల్పుల విరమణ విషయంలో తేడా వస్తే కూడా తడాఖా చూపించడానికి సిద్ధంగానే ఉంది.

# కనిపించని ప్రోత్సాహం.. కుటుంబ నియంత్రణ తిరోగమనం




పరిగి : కుటుంబ నియంత్రణ (కు.ని.) ఆపరేషన్లలో జిల్లా వెనుకబడి పోతోంది. నగదు ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం, గైనకాలజిస్టులు, అనెస్తీషియన్ తదితర సిబ్బంది లేకపోవడం, మౌలిక సదుపాయాలు కల్పించక పోవడం వీటికి తోడు పురుషుల్లో తొలగని అపోహలు తదితర కారణాలు ఇందుకు ప్రతిబంధకంగా మారుతున్నాయి.

**వేసెక్టమీపై నేటికీ పురుషుల వెనుకడుగు**

చికిత్స చేయించుకుంటే తమ శక్తి సామర్థ్యాలు తగ్గిపోతాయనే అపోహ పురుషుల్లో నేటికీ తొలగలేదు. దీంతో వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకోవడానికి వారు ముందుకు రావడంలేదు. ఏడాది కాలంలో ఒక్కటీ జరగకపోవడం ఇందుకు ఉదాహరణ. కుటుంబ నియంత్రణ (ట్యూబెక్టమీ) అనేది ఆడవారి బాధ్యత అన్నట్లుగా వ్యవహరించడంతోనూ లక్ష్యసాధన చేరడంలేదు.

ఐదేళ్ల క్రితమే ఆపేశారు కు.ని.ఆపరేషన్లు చేయించుకునే స్త్రీ, పురుషులకు ప్రభుత్వం ఐదేళ్లుగా నగదు ప్రోత్సాహకాలు అందించడం మానేయడమే కాదు తర్వాత ప్రభుత్వం శిబిరాలు నిర్వహించటం కూడా రద్దు చేసింది. జిల్లాలో పెద్ద పట్టణం తాండూరు జిల్లా ఆస్పత్రి పీపీ యూనిట్ విభాగంలో గతంలో రెగ్యులర్‌గా కు.ని. ఆపరేషన్లు చేసేవారు. దీనివల్ల ఎక్కువ మంది ముందుకు వచ్చేవారు. ఇప్పుడు మహిళలు చొరవ చూపితేనే చేస్తున్నారు. ఇలా ప్రస్తుతం నెలకు కనీసం 70 కూడా దాటడం లేదు. గతంలో 200కు పైగా ఉండేవి.

**అపోహలు తొలగిస్తున్నాం**

కు.ని ఆపరేషన్ల నిర్వహణపై పురుషుల్లో ఉన్న అపోహలను తొలగిస్తున్నాం. సామాజిక, జిల్లా ఆసుపత్రుల్లో నిరంతరం ఇవి కొనసాగుతున్నాయి. ప్రత్యేక క్యాంపుల కోసం ఎవరూ ఎదురు చూడవద్దు. పవిత్ర, జిల్లా ప్రోగాం అధికారి, వికారాబాద్

**ఇది నిరంతర ప్రక్రియ**కు.ని.శస్త్ర చికిత్సలు నిరంతర ప్రక్రియ. దీనికి ప్రత్యేకంగా శిబిరాలు నిర్వహించాల్సిన పనిలేదు. పరిగి ప్రభుత్వాసుపత్రిలో నిర్వహిస్తున్నాం. రాజశేఖర్, ఆసుపత్రి సూపరింటెండెంట్, పరిగి సామాజిక ఆసుపత్రి.

# లక్ష్యానికి మించి.. తాగునీటి పరీక్షలు



ఖమ్మం : ప్రజలు వినియోగించే తాగునీటిని ప్రయోగశాలల్లో పరీక్షిస్తుంటారు. బోర్లు, బావులు, పీడబ్ల్యూ పథకాలు సహా వివిధ నీటివనరుల నుంచి తాగునీటిని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ నల్లా ద్వారా నీరు అందిస్తోంది. ఈ జలాలను వివిధ దశల్లో శుద్ధిచేస్తున్నా పైపులు, ట్యాంకులు దాటి ఇళ్లకు చేరేసరికి నాణ్యత ఎలా ఉంటుందనే సందేహాలను చాలామంది వ్యక్తపరుస్తుంటారు. తాగునీటిని నిరంతరం పరీక్షించేందుకు ప్రభుత్వం ప్రయోగశాలలు ఏర్పాటుచేసింది. ఖమ్మంలోని మిషన్ భగీరథ కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రయోగశాల ఉంది. మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేటలో సబ్ డివిజన్ స్థాయి ప్రయోగశాలలు కొలువుదీరాయి. ప్రతి ప్రయోగశాలలో నెలకు 300 చొప్పున ఏడాదికి 3,600 నీటి నమూనాలు పరీక్షించాలి. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు కేటాయించిన లక్ష్యాన్ని మించి పరీక్షలు పూర్తిచేశారు. ఖమ్మంలో 4,428, మధిర- 3,767, సత్తుపల్లి- 3,896, కొత్తగూడెం-4863, మణుగూరు-3697, భద్రాచలం- 3,743, అశ్వారావుపేటలో 3,686 నీటి నమూనాలు పరీక్షించారు.

తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం, బ్యాక్టీరియా, నైట్రేట్స్ సహా వివిధ రకాల ఖనిజాలు, రసాయనాల స్థాయిని ప్రయోగశాలలో పరీక్షించి నీటి నాణ్యత ధ్రువీకరిస్తారు.

**49 నీటి వనరుల్లో ఫ్లోరైడ్**

ఖమ్మం జిల్లాలో 49 గ్రామ పంచాయతీల్లోని 49 నీటివనరుల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్నట్లు తేల్చారు. వెంటనే ఈ నీటి వనరులను వినియోగించకుండా మూసేశారు. బోర్లలో నీటిని పరీక్షించినప్పుడు ఫ్లోరైడ్ గుర్తించారు. ఫ్లోరైడ్ 1 నుంచి 1.5 మి.గ్రా.వరకు లీటర్ నీటిలో ఉండొచ్చు. అంతకు మించిన నీటిని తాగిన వారికి ఫ్లోరోసిస్ వ్యాధి సోకే ప్రమాదముంది. వేసవిలో నీటి వనరుల్లో నీటిమట్టం అడుగంటుతుంది. నీటిమట్టం కిందిగి దిగజారేకొద్దీ నీటిలో ఫ్లోరైడ్ శాతం పెరుగుతుంటుంది.

పాఠశాలల్లో పిల్లలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యత ధ్రువపత్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల అడుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు సహా ప్రభుత్వ రంగ సంస్థలు నీటి నాణ్యత పరీక్షలను ఈ ప్రయోగశాలల్లో చేయిస్తుంటాయి.

ప్రైవేటు వ్యక్తులు సైతం తాము ఉపయోగించే నీటి నాణ్యతను ప్రయోగశాలల్లో పరీక్షించుకోవచ్చు.లీటరు నీటిని తెచ్చి ప్రయోగశాలలో అందించాలి. రూ.500చలానా రూపంలో చెల్లించాలి.

గత ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో మున్నేరుకు వరదలు రావటంతో వివిధ గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ దెబ్బతింది. బురద నీరు చేరింది. కలెక్టర్ ఆదేశాలతో వరద ప్రభావిత ప్రాంతాల్లోని నీటి వనరుల నుంచి నమూనాలు సేకరించి పలుమార్లు పరీక్షలు నిర్వహించి ఫలితాల నివేదికను ఉన్నతాధికారులకు అందించాం. అందుకు అనుగుణంగా అప్పట్లో తాగునీటిని సరఫరా చేశారు. ఈఏడాది లక్ష్యాన్ని అధిగమించాం.

వంకాయలపాటి రమాదేవి, ప్రయోగశాలల జిల్లా కన్సల్టెంట్, ఖమ్మం

# మామిడి రైతులకు మహర్దశ



ఖమ్మం : నగరంలో మామిడి మార్కెట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రోటరీనగర్ సమీపంలోని వీధివ్యాపారుల ప్రాంగణంలో వారం రోజుల్లో ఏర్పాటు చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక కృషితో ముస్తాబవుతోంది. మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే విధంగా సిద్ధం చేస్తున్నారు. మొత్తం 35 స్టాల్స్‌లో రైతులు పండ్లను విక్రయించేందుకు అవకాశం ఉంది. నగరంలో ఉమ్మడి జిల్లా స్థాయి మామిడి రైతులు, ఎగుమతిదారులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పలువురు రైతులు మామిడి మార్కెట్ ఏర్పాటు గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్ లేకపోవటం వల్ల జరిగే నష్టం గురించి వివరించారు. స్పందించిన ఆయన మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన, వ్యవసాయ, నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ప్రాంగణాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. సీజనల్ మార్కెట్‌గా దీన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో 32వేల ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 12వేల ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. దీని ద్వారా 1.80లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఇక్కడి నుంచి ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, నాగ్‌పూర్, కోల్‌కతా, ముంబయి, లఖ్‌నవూకు రవాణా చేస్తారు. అక్కడి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికా, యూకే, కువైట్, ఖతర్, కెనడా, నేపాల్, సింగపూర్, న్యూజిల్యాండ్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు.

**ఫ్రూట్ కవర్ల కోసం వినతి..**

పండ్ల నాణ్యత దెబ్బతినకుండా ఉండేందుకు తమకు ఫ్రూట్ కవర్లను రాయితీపై అందజేయాలని మామిడి రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మార్కెటింగ్‌శాఖ అధికారులు వ్యవసాయ మార్కెట్ల ద్వారా, సహకారశాఖ అధికారులు సహకార సంఘాల ద్వారా రైతులకు ఎక్కడ అవసరమో గుర్తించి అందుకు అనుగుణంగా వారిని సరఫరా చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు.

**మండీలే దిక్కు..**

ప్రస్తుతం మామిడి పంటకు పలు రకాల తెగుళ్లు ఆశిస్తున్నాయి. వీటికి అనేక రకాల పురుగు మందులు వాడినప్పటికీ అదుపులోకి రావటం లేవు. ఫలితంగా రైతులకు పెట్టుబడి పెరగటంతో దిగుబడి తగ్గిపోతోంది. నాణ్యమైన పంట సైతం అంతంత మాత్రంగానే ఉంటుంది. నాణ్యతలేని పంటకు మార్కెట్‌లో సరైన ధర లభించదు. విదేశాలకు ఎగుమతి చేయాలంటే నిబంధనలు మరింత కఠినతరంగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, నాణ్యతగల దిగుబడులు పెంచేందుకుగాను అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సైతం మామిడికాయలు కొనేందుకు అనేక మంది వ్యాపారులు ప్రతి సంవత్సరం ఇక్కడకు రావటం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో మామిడి మండీలను ఏర్పాటు చేశారు. ఇక్కడే గ్రేడింగ్ చేసిన అనంతరం పొరుగు రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు.

# సిబ్బంది లేక ఇబ్బంది..!

ఖమ్మం: ఖమ్మం ప్రభుత్వ బోధనాసుపత్రి (సర్వజనాసుపత్రి)లో వైద్యనిపుణుల కొరత వేధిస్తోంది. కీలకమైన రేడియాలజీ విభాగంలో నిపుణులు లేకపోవటంతో స్కానింగ్ పరీక్షల నిర్వహణ, వ్యాధి నిర్ధారణ నివేదికల జారీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు పలుమార్లు వైద్యాధికారులు నోటిఫికేషన్ వెలువరించినా అభ్యర్థుల నుంచి స్పందన లేదు. ప్రభుత్వం చెల్లించే వేతనాల పట్ల నిరాసక్తతే పోస్టుల భర్తీకి ఆటంకంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఖాళీలు ఎక్కడెక్కడంటే.. సర్వజనాసుపత్రిలో 34 విభాగాలు ఉంటాయి. 115 పోస్టులకు 39 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 21విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ అధ్యాపక పోస్టుల్లో



ఏదో ఒకటి ఖాళీగా ఉంటోంది. రేడియాలజీలో నాలుగు, కమ్యూనిటీ మెడిసిన్, ఫిజికల్ మెడిసిన్, హాస్పిటల్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్‌లో మూడేసి చొప్పున, జనరల్ మెడిసిన్, అనాటమీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, సైకియాట్రీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, గైనకాలజీలో రెండేసి చొప్పున, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, డెర్మటాలజీ, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, డెంటల్, రెస్పిరేటరీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఒక్కోటి చొప్పున పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.


భోధనాసుపత్రిలో ఆచార్యుల పోస్టుల భర్తీకి పలుమార్లు నోటిఫికేషన్లు ఇచ్చాం. అభ్యర్థుల నుంచి స్పందన కనిపించలేదు. దరఖాస్తులు వచ్చిన వాటిలో అర్హులుంటే వెంటనే భర్తీ చేస్తున్నాం. ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. ప్రస్తుతం ఒకట్రెండు విభాగాలు మినహాయిస్తే వైద్యసేవలు, బోధనకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఖాళీలను భార్తీ చేసేందుకు మరోమారు నోటిఫికేషన్ ఇచ్చేందుకు యత్నిస్తున్నాం.డాక్టర్ రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, సర్వజనాసుపత్రి, ఖమ్మం

# ఆదాయం ఘనం.. వసతులు గగనం..!

వేంసూరు : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక దేవాలయాలకు వందలు, వేలాది ఎకరాల భూములున్నా, అధికాదాయం సమకూరుతున్నా.. ఆమేరకు అభివృద్ధి పనులు జరగటం లేదు. ఉభయ జిల్లాల్లో రూ.2లక్షల్లోపు ఆదాయం కలిగిన ఆలయాలకు భక్తుల విన్నపాల మేరకు పాలకవర్గాలను అధికారులు నియమించారు. రూ.25లక్షల ఆదాయం కలిగిన ఆలయాలకు జిల్లా కమిషనరేట్ స్థాయిలో పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. ఖమ్మం జిల్లాలో జమలాపురం, కందుకూరు, భద్రాద్రి జిల్లాలో భద్రాచలం, అన్నపురెడ్డిపల్లి, పెద్దమ్మగుడి తదితర ఆలయాలకు సుమారు దశాబ్దకాలంగా పాలకవర్గాలు లేవు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో 190, భద్రాద్రి జిల్లాలో 32 ఆలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 14,391.32 ఎకరాల భూముల్లో 1,284.07 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు రెవెన్యూశాఖ లెక్కలు చెబుతున్నాయి.

తాత్కాలిక కమిటీలతోనే సరి.. రూ.25లక్షల కంటే ఎక్కువ ఆదాయం వస్తున్న ఆలయాలకు ఉత్సవాల సమయంలో మూడు నుంచి ఆరునెలల కాలపరిమితితో తాత్కాలిక కమిటీలను దేవాదాయశాఖ అధికారులు నియమిస్తున్నారు. ఈ కమిటీలకు పర్యవేక్షణ మినహా ఎలాంటి అధికారాలు ఉండవు. ఆలయ నిర్వహణలో దేవాదాయశాఖ, ఆలయ అధికారులు ఏపని చేయాలన్నా ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. పాలకవర్గాలను నియమిస్తే ప్రధానంగా ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవచ్చు. ప్రభుత్వంతో చర్చించి ఆలయాల పునరుద్ధరణ, అదనపు శాశ్వత నిర్మాణాలకు నిధులు రాబట్టే అవకాశముంది. ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

వేంసూరు మండలం కందుకూరులో కాకతీయుల కాలం నాటి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 365 ఎకరాల భూమి ఉంది. ఏటా రూ.30లక్షల పైచిలుకు ఆదాయం వస్తుంది. ఆలయ ముఖమండపం శిథిలావస్థకు చేరుకుంది. మూలవిరాట్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల మందిరాలు, రథశాలను పునర్నిర్మించాలి. ఆలయాభివృద్ధికి అదే గ్రామానికి



చెందిన హెటిరోడ్రగ్స్ అధినేత, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి రెండేళ్ల క్రితం రూ.2కోట్లు విరాళం ప్రకటించారు. తితిదే నుంచి మరో రూ.4కోట్లు మంజూరయ్యాయి. అయినా ఆలయాభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోవటం లేదు.

అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి 2,224 ఎకరాల భూములున్నాయి. వీటిపై వచ్చే ఆదాయంతో దుకాణాల సముదాయం, కోనేరు నిర్మించాలనే ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. రేణుకాచౌదరి కేంద్ర పర్యాటకశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆలయాభివృద్ధికి రూ.కోటి ప్రకటించినా వినియోగించుకోలేదు.తెలంగాణ తిరుపతిగా పేరొందిన ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 62.50 ఎకరాల భూమి ఉంది. దీనిపైనా, భక్తుల కానుకల రూపంలో ఏటా సగటున రూ.6కోట్లు ఆదాయం సమకూరుతుంది. అన్నదానం నిమిత్తం మరో రూ.3కోట్లు ఉన్నాయి. అయినా ఆలయంలో భోజనశాల సౌకర్యాలు మెరుగుపడటం లేదని భక్తులు వాపోతున్నారు.రూ.25లక్షల కన్నా ఎక్కువ ఆదాయం కలిగిన ఆలయాలకు సంబంధిం చి ప్రకటనలిచ్చాం. త్వరలో పాలకవర్గాలను నియమిస్తాం. జీపీఎస్ పద్ధతిలో సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగిస్తాం. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తాం. వీరస్వామి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్

# అవినీతి.. అదే రీతి!



కరీంనగర్: 'ఏ శాఖ చూసినా ఏమున్నది గర్వకారణం.. అంతా మామూళ్లమయం'.. అని ప్రజలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కనిపిస్తోంది. ఇదీ.. అదీ అని లేకుండా దాదాపుగా అన్ని శాఖల్లోనూ కొంతమంది ఉద్యోగులు ప్రతి పనికి పైసాతోనే ముడిపెడుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. కార్యాలయంలో దస్త్రం కదలాలన్నా.. రావాల్సిన జీతం ఠంచనుగా చేతికందాలన్నా ఎంతోకొంత ముట్టజెప్పాల్సిన పరిస్థితి నాలుగు జిల్లాల్లో ఇంతకింతకు పెరుగుతోంది. ఇంత ఇస్తేనే ఈ పని చేస్తామనే పంథా కొందరు ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వినిపిస్తుండటం బాధాకరం.

**దొరికేది కొందరే..!** ప్రతి శాఖలో ఉన్న అవినీతి అధికారుల్లో కొంతమంది మాత్రమే అనిశా అధికారులకు పట్టుబడుతున్నారు. అది కూడా డబ్బులు ఇవ్వమని వ్యతిరేకిస్తూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన వారు అవినీతి ఉద్యోగుల భరతం పడుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో నిత్యం వందలాది మంది ప్రతి పనికి సిబ్బంది, ఉద్యోగులు అడిగినంత చేతిలో పెట్టేసి కావాల్సిన పనిని చక్కబెట్టుకుంటున్నారు. ఎందుకొచ్చిన గొడవ అన్నట్లుగా తమ పని పూర్తయితే చాలనే తీరున వ్యవహరిస్తున్నారు. దొరకకుండా తప్పించుకునే వారి సంఖ్యనే ఎక్కువగా ఉంటోంది. కానీ ప్రజల్లో లంచం ఇవ్వం అన్న భావన మరింతగా పెరగాల్సిన అవసరముంది. ఆయా శాఖల్లోని ప్రభుత్వ సిబ్బంది వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులందుతున్నా కఠినమైన చర్యలు తీసుకోకపోవ డం వల్ల పైసలు అడిగే తంతు ఇంతకింతకు పెరుగుతోంది. ఆయా శాఖల్లోని ఉన్నతాధికారులు కూడా తమ సిబ్బంది పారదర్శకంగా పనులు చేసే విధంగా పర్యవేక్షణ చేస్తూ లంచాలకు దూరంగా ఉండే విధంగా సంస్కరణలు చేపడితే ప్రజలకు మేలు జరుగుతుంది.

**ఈ ఏడాది 14 మంది** ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 14 మంది ప్రభుత్వ ఉద్యోగులు పని కోసం లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు పట్టుబడ్డారు. ముఖ్యంగా కీలకమైన పోలీసు, రెవెన్యూ శాఖల్లోని అధికారులు పట్టుబడుతుండటం గమనార్హం. తరచూ అవినీతి నిరోధకశాఖ అధికారులు దాడులు చేస్తున్నా కొంతమంది ఉద్యోగుల తీరు మారకపోవడం గమనార్హం. ప్రతి ఏడాది నెలకు సగటున ఒకరు పట్టుబడుతుండగా ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో సగటున నెలకు నలుగురు దొరకడం విస్మయాన్ని కలిగిస్తోంది.

## కార్తెలు పలకరించక ముందే.. కాడిని కట్టండి

గరిడేపల్లి: యాసంగి పంట చేతికి వచ్చింది. ముందుగా పంట అమ్మిన రైతులకు సొమ్ము చేతికందింది. ఆలస్యంగా కోతలు కోసిన రైతులకు మరో వారంలో అందుతుంది. ఈలోగా రైతులు ఖాళీగా కూర్చోకుండా వానాకాలం పంటకు ప్రణాళిక వేసుకోవాలి. పూర్వం రైతులు కార్తెల ప్రకారం పంటలు వేసేవారు. కత్తెర పంట పూర్తవగానే ఆరుద్ర కార్తెలో మెట్ట పంటలకు దుక్కులు సిద్ధం చేసుకునే వారు. నాగలి, గొర్రు, గుంటక, దంతె ఇలా చెక్కతో చేసే పరికరాలన్నీ వడ్రంగి వద్ద చెట్టుకింద కొలిమి పెట్టి బాగు చేయించేవారు. ఎంత ఎండ ఉన్నా నీడలో కూర్చుని చేసే పనులను పగలంతా చేసేవారు. అవసరమైతే దుక్కులు దున్నడానికి వేకువజామునే వెళ్లి మధ్యాహ్నానికి ఇంటికి వచ్చేవారు. ఇప్పుడు రైతులు ట్రాక్టర్లతో వ్యవసాయం చేస్తున్నందున ట్రాక్టర్ల మరమ్మతులు, దున్నడానికి అవసరమైన కల్టివేటర్, పడ్లర్, రోటోవేటర్, కేజీవీల్స్, గొర్రు వంటివి సిద్ధం చేసుకోవాలి. ఇళ్లల్లో పశువుల ఎరువు ఉంటే పొలానికి తోలుకోవాలి. తొలకరి వర్షం పడితే కరిగిపోయేలా చూసుకోవాలి. చేతిలో ఉన్న నగదు, వానాకాలానికి అయ్యే ఖర్చు అంచనా వేసుకోవాలి.

గత అనుభవాలను, చుట్టు పక్కల రైతులు వేసిన అధిక దిగుబడినిచ్చే వంగడాలు, తెగుళ్లు, పురుగుల తాకిడి తట్టుకునే రకాలు తెలుసుకోవాలి. అవి ఎక్కడ లభ్యమవుతాయో సమాచారం తెలుసుకోవాలి. ఇప్పుడు



తెచ్చుకుంటే ఇంట్లో లేదా కొట్టులో ఎలుకలు ఉండే అవకాశం ఉంది. తొలకరి వర్షాలు పడిన వెంటనే తెచ్చుకునేలా డబ్బు, సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలి.

ఇటీవల మహబూబ్‌నగర్ ప్రాంతం నుంచి గొర్రెల మందలు వస్తున్నాయి. వాటిని పొలంలో ఉండేలా చేసి ఎరువు ఏర్పాటు చేసుకోవాలి. సేంద్రియ ఎరువుల కోసం జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి విత్తనాలు తెచ్చి జూన్‌లో చల్లుకోవాలి.

దుక్కుల వేడి తగ్గడంతో పాటు నేలకు భూసారం అందించే ఎరువు లభ్యమవుతుంది. ఇప్పుడు అధికంగా వేప పండ్లు, కాయలు దొరుకుతాయి. వాటిని సేకరించుకోవాలి. వానాకాలం కోసం వ్యర్థాలను సేకరించి వర్మీ కంపోస్టు, కంపోస్ట్ ఎరువులు తయారు చేసుకోవచ్చు. జీవ, వృక్ష సంబంధ కషాయాలు, జీవామృతం కోసం అవసరమైన మెటీరియల్ సేకరించుకోవాలి. ప్రధానంగా రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఏయే పోషకాలు లేవో వాటిని కచ్చితంగా వేసుకునేలా సంబంధిత పోషకాలను తెచ్చిపెట్టుకోవాలి.

వివిధ ప్రాంతాలలో(పరిశోధనా స్థానాల్లో) కొత్తగా వచ్చే హైబ్రిడ్, అధిక దిగుబడినిచ్చే రకాలు తెచ్చుకోవాలి. ఇప్పుడు హడావుడి లేకుండా చూసుకుంటే నైరుతి రుతు పవనాలు రాగానే సాగుకు సన్నద్ధం కావచ్చు.

## కొత్త పరిశ్రమలొస్తున్నాయ్!

సంగారెడ్డి : జిల్లా జనాభా: 15.27లక్షలు

యువత: 7.20లక్షలు

కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు అందిన దరఖాస్తులు: 501

పెట్టుబడి వ్యయం(అంచనా): రూ.18,097 కోట్లు

ఉపాధి: 21,477 మందికి..

పారిశ్రామికంగా జిల్లా ఇప్పటికే ముందంజలో ఉంది. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలోనే ఉండటం యువతకు కలిసివచ్చే అంశం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం ఇక్కడ ఉపాధి అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. జిల్లాలో కొత్తగా మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే అనుమతుల కోసం సంబంధిత శాఖలకు దరఖాస్తులు అందాయి. ఈ నేపథ్యంలో యువత నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుంది. **ప్రక్రియ వేగవంతం..**

జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు అన్ని రకాల వనరులు అందుబాటులో ఉండటంతో ఎక్కువ మంది పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. పరిశ్రమ ఏర్పాటుచేయాలంటే గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా సమస్యలు లేవు. టీజీఐపాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేస్తే సరిపోతుంది. 18 ఏళ్లకు పైబడిన వారెవరైనా సూక్ష్మ, మధ్యతరహా, భారీ పరిశ్రమల ఏర్పాటు కోసం టీజీఐపాస్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ఇస్తోంది. పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు దక్కించుకోవాలంటే యువత నైపుణ్యాలు పెంచుకోవడం ముఖ్యం. ఐటీఐ, డిప్లొమా కోర్సుల్లో చేరిన విద్యార్థులు నూతన సాంకేతిక యంత్రాల వినియోగంపై అవగాహన పెంచుకోవాలి. సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలి. ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిభ చాటితే ఉద్యోగావకాశాలకు కొరత లేదు.

**జిల్లా అభివృద్ధికి దోహదం**

జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధికి బాటలు పడనున్నాయి. పరిశ్రమ ఏర్పాటు చేసిన గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు యాజమాన్యాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద కూడా జిల్లా యంత్రాంగానికి నిధులు అందజేస్తున్నారు. లాభాల్లో కొంత వాటాను సీఎస్ఆర్‌కు కేటాయిస్తున్నారు. ఇటీవల సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు అత్యాధునిక వసతులతో 18 తరగతుల సముదాయం సీఎస్ఆర్ నిధులతో నిర్మించారు.

**భారీగా పెట్టుబడులకు అవకాశం**

2024-25 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 501 పరిశ్రమల ఏర్పాటు కోసం దరఖాస్తులు అందాయి. ఆయా పరిశ్రమలు నెలకొల్పేందుకు 837 అనుమతులు సంబంధిత శాఖల నుంచి రావాల్సి ఉండగా.. ఇప్పటికే 568 అనుమతులు మంజూరు చేశారు. కొత్తగా ఏర్పాటు కానున్న పరిశ్రమలతో జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. భారీగా పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం విశేషం. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ద్వారా అనుమతుల ప్రక్రియను సైతం వేగవంతం చేశారు. అతి త్వరలోనే పరిశ్రమలన్నీ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

**జాప్యానికి తావులేకుండా..** -తుల్జానాయక్, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ పరిశ్రమల ఏర్పాటుకోసం టీజీఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. నిబంధనలకు అనుగుణంగా ఉంటే అనుమతులు వెంటనే జారీ చేస్తున్నాం. యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

## వారు పట్టు వీడరు.. వీరు మెట్టు దిగరు



కరీంనగర్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 14 నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభమవుతాయా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు విడుదల కాకపోవటంతో మే 2 లోగా వర్సిటీకి చెల్లించాల్సిన విద్యార్థుల ఫీజులు ప్రైవేట్ కళాశాలలు ఇంతవరకు చెల్లించలేదు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు (రాష్ట్రవ్యాప్తంగా) జూమ్ మీటింగ్ నిర్వహించి ఏకతాటిపై ఉండి బహిష్కరణకు కట్టుబడి ఉందామని ప్రకటించాయని స్థానిక ఓ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వివరించారు. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణపై నీలినీడలు అలుముకుంటున్నాయి. ఇదిలా ఉండగా.. ఓ వైపు వర్సిటీ అధికారులు మాత్రం మే 14 నుంచి డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షల నియమావళిని మే 1నే ప్రకటించాయి.

**ఫీజు రీయింబర్స్‌మెంటే ప్రధానం**

ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయటం లేదు. కళాశాలల నిర్వహణ, అధ్యాపకుల వేతనాలు, తదితర నిర్వహణ ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు మంత్రులను కలిసి విన్నవించారు. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌ను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. వర్సిటీ అధికారులతో చర్చలు జరిపినా సఫలం కాలేదు. చేసేది లేక బహిష్కరణ పిలుపుకే కట్టుబడి ఉందామని పట్టుపడుతున్నాయి ప్రైవేట్ కళాశాలలు. వర్సిటీ పరిధిలోని 16 వేల మంది విద్యార్థులు పరీక్షలు సజావుగా జరుగుతాయా? అని ఎదురు చూస్తున్నారు.

**తల్లిదండ్రుల ఆందోళన**

వర్సిటీ అధికారులు కళాశాలల ప్రతినిధులతో చర్చలు జరిపినా, వేర్వేరు మార్గాల్లో నచ్చజెబుతున్నా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి. పరీక్షలను వాయిదా చేస్తే విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. జూన్ 1 నుంచే ఎడ్‌సెట్, లాసెట్, ఐసెట్ ప్రవేశ పరీక్షలు జరగనున్నాయని, ఈ పరిణామాలతో విద్యార్థులు సరిగా ప్రవేశ పరీక్షలకు సన్నద్ధం కాలేరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఫీజు చెల్లించిన వారికి పరీక్షలు** కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల వారి విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లించల్లేదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులతోపాటు ఫీజు చెల్లించిన ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తాం. ఇప్పటికైనా చెల్లిస్తే అవకాశం ఇస్తాం. -ఉమేశ్‌కుమార్, విశ్వవిద్యాలయం ఉపకులపతి

## ఆసుపత్రి ఆధునీకరణకు అడుగులు



గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడంపై జిల్లా పాలనాధికారి శ్రీహర్ష ప్రత్యేక దృష్టి సారించారు. నిరంతరంగా ఆసుపత్రి పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు సంబంధిత ఉన్నతాధికారుల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నారు. కలెక్టర్ భార్య మొదటి నుంచి గోదావరిఖని ఆసుపత్రిలోనే వైద్యంతోపాటు ప్రసవం చేయించుకోవడంతో.. ఈ ఆసుపత్రిపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచినట్లయింది.

**సిబ్బంది పని తీరుపై దృష్టి** ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధుల విడుదలకు కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు సిబ్బంది పనితీరు మెరుగుదలపై దృష్టి సారించారు. దీనిలో భాగంగానే ఆయన ఆదేశాల మేరకు ఆసుపత్రిలోని ఓ వైద్యుడిని సరెండర్ చేయడంతోపాటు మరొకరికి మెమోలు జారీ చేశారు. మరో వైద్యురాలిని ప్రస్తుతం నిర్వహిస్తున్న బాధ్యతలనుంచి తప్పించాలని సమాలోచిస్తున్నట్లుగా సమాచారం. ఆసుపత్రి నిర్వహణలో కీలకమైన రెసిడెంట్ మెడికల్ అధికారిగా పూర్తి బాధ్యతలను ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అప్పగించారు. **నిధుల ప్రణాళిక ఇలా..**

ఆరు నెలలపాటు నిర్వహణతోపాటు కొన్ని అత్యవసరమైన పరికరాల కొనుగోళ్లకు సుమారు రూ.28 లక్షల నిధులు విడుదల చేశారు. సిటీ స్కానింగ్, 2డీ ఎకో వైద్య పరీక్షలకు గతంలో ఆసుపత్రి వర్గాలు రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తుండేవారు. దీనికి అవసరమైన నిధులను విడుదల చేయడంతో ఇకపై ఆయా సేవలు ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

నవజాత శిశువులకు అత్యవసర వైద్య సేవలందించేలా వెంటిలేటరు కొనుగోలుకు రూ.3.4 లక్షలు, కొన్ని రకాల స్కానింగ్ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకునేందుకు మరో రూ.2 లక్షలు విడుదలయ్యాయి.

నేత్ర శస్త్ర చికిత్సలకు ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్ పనులు చివరిదశకు చేరుకున్నాయి. అత్యవసర మందులను సరఫరా చేసిన గుత్తేదారుకు ఆసుపత్రి నుంచి బిల్లులు భారీగా చెల్లించాల్సి ఉండటంతో.. తాత్కాలికంగా ఉపశమనం కలిగించేలా కొన్ని నిధులు కేటాయించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ఆసుపత్రి రెండో అంతస్తులోని వార్డుల్లో వేడి తీవ్రంగా ఉంటుంది. దీంతో రోగులు, బాలింతలు తీవ్ర ఇబ్బంది పడుతుండడంతో ఏసీ సదుపాయం కల్పించాల్సి ఉంది. తాత్కాలికంగానైనా కూలర్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ఆసుపత్రిలోని కొన్ని విభాగాల్లో ఏసీలు పనిచేయకపోవడంతో వైద్య పరీక్షలకు సంబంధించిన యంత్రాలు చెడిపోయే ఆస్కారముంది. ఆ దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

## రోడ్ల వెంబడి యథేచ్ఛగా పారబోత

హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారితో పాటు సూర్యాపేట ఖమ్మం 365వ జాతీయ రహదారి పొడవునా ఎక్కడపడితే అక్కడ ఇలా పారిశ్రామిక వ్యర్థాలను పడేస్తున్నారు. చివ్వెంల మండలం వల్లభాపురం, ఖాసీంపేట, జగన్‌నాయక్‌తండా, అక్కలదేవి గూడెం, చందుపట్ల గ్రామాల సమీపంలో వ్యర్థాలను పారబోస్తుండగా స్థానికులు వారిని పట్టుకొని పోలీసులకు ఫిర్యాదులు చేసిన ఘటనలు ఉన్నాయి.

**నేల, నీరు కలుషితం..**

వ్యర్థాలను పారబోసిన ప్రాంతం గ్రామాలకు సమీపంలో ఉండడంతో వాటి నుంచి వచ్చే దుర్గంధాన్ని పరిసర వాసులు భరించలేకపోతున్నారు. దీంతో శ్వాసకోస సంబంధిత వ్యాధులు వస్తాయనే ఆందోళనలో ఉన్నారు. అవశేషాల ప్రభావానికి ఆయా ప్రాంతాల్లో చెట్లు చనిపోవడమే కాకుండా అక్కడ మరో చెట్టు పుట్టి పెరిగే పరిస్థితి లేకుండా పోతోంది. అవి భూమిలోకి ఇంకి బోరుబావుల నీళ్లు సైతం కలుషితమయ్యే పరిస్థితి వస్తుందంటున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం:

బైరు రవీందర్, జగన్‌నాయక్‌తండా

వల్లభాపురం, ఖాసీంపేట, జగన్‌నాయక్‌తండా పరిసర ప్రాంతాల్లో రహదారుల వెంట ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. ఎన్నోసార్లు వారిని పట్టుకొని అధికారులకు అప్పగించాం. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో షరామామూలైంది. వాటి నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నాం.

ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు

బాసిపంగు సునీల్, చందుపట్ల

గత ఐదేళ్ల నుంచి రోడ్ల వెంట గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. పర్యావరణానికి హాని, శ్వాసకోస సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నమూనాలు సేకరించాం:

పురుషోత్తంరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి

ఇటీవల అక్కలదేవిగూడెం వద్ద పారబోసిన వ్యర్థాలలో నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించాం. అవి హానికరమైనవా లేదా అనేది తేలాల్సి ఉంది. తుది నివేదిక రాగానే తగు చర్యలు తీసుకుంటాం. పోలీసులు సైతం దీనిపై దృష్టిపెట్టి కేసులు నమోదు చేయాలి.

## ఆరోగ్యం పణం.. రక్షణ సామగ్రి కనం!

మెదక్ : జిల్లాలోని నాలుగు పురపాలికల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందికి సకాలంలో రక్షణ సామగ్రి అందజేయడం లేదు. వివిధ పనులు చేస్తున్న వారికి సబ్బులు, నూనె, మాస్కులు, శానిటైజర్లు, హెల్మెట్లు, బూట్లు, ఆర్ఫాన్లు(రేడియంతో కూడిన జాకెట్లు) ఇవ్వాల్సి ఉన్నా, అధికారులు దృష్టి సారించడంలేదు. నెలల తరబడి ఇదే విధంగా కొనసాగడంతో వారు అనారోగ్యానికి గురవుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**వారి వల్లే శుభ్రత**

పారిశుద్ధ్యాన్ని మెరుగు పర్చడంలో వారు ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా శ్రమిస్తారు. ఇందులో భాగంగా నిత్యం మురుగు కాల్వలు శుభ్రం చేయడం, వీధులు ఊడ్చడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, రసాయన ద్రావణాలు పిచికారీ చేయడం వంటివి చేపడుతుంటారు. చెత్తను ట్రాక్టర్ ఎత్తడం, డంప్ యార్డులకు తరలించడం వంటి పనులు చేస్తున్నారు. మురుగు కాల్వల్లో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగిస్తున్నారు. వివిధ రకాల పనులు చేస్తూ పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దోమల నియంత్రణకు మందులు పిచికారీ చేస్తున్నారు. వీరికి సరైన రక్షణ సామగ్రి లేక అనారోగ్యానికి గురవుతున్నారు. కొందరు తరచూ సెలవులు పెడుతున్నారు.

**నెలల తరబడి ఆలస్యం..**

ఏటా రెండు, మూడు సార్లు రక్షణ సామగ్రి ఇవ్వాలి. దుస్తులు, మురుగు కాల్వల్లో చెత్తను తీసే పారలను, కాల్వల్లో దిగేందుకు పెద్ద పరిమాణంలో ఉన్న బూట్లను, చేతులకు రక్షణ పరికరాలను ఇవ్వాల్సి ఉంటుంది. వాస్తవానికి సామగ్రి ఇవ్వకుండానే పనులు చేస్తున్నారు. కాలువలో చేరిన వ్యర్థాలను చేతితో ఎత్తి బయట పారేస్తున్నారు. ఈ సమయంలో గాజు ముక్కలు కాళ్లకు గుచ్చుకుంటున్నాయి.

మెదక్ పురపాలికలో ఆరు నెలల కిందట ఇచ్చారు. రెండోసారి అందజేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈనెలాఖరులోగా ఇస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ చెప్పారు. టెండరు ప్రక్రియ ద్వారా వీటిని పంపిణీ చేస్తామన్నారు. కార్మికులు మాత్రం అడిగితేనే ఇస్తున్నారంటున్నారు. నర్సాపూర్‌లో సిబ్బందికి నాలుగు నెలలుగా ఇవ్వలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఆగస్టు 15న ఇస్తామని అంటున్నారు. గ్లౌజ్‌లు, ఫేస్ షీల్డులు, బూట్ల జాడేలేదు. మూడు నెలలుగా సబ్బులు ఇవ్వలేదు. రేడియంతో కూడిన జాకెట్లు లేవు. రోడ్లు శుభ్రపర్చే సమయంలో ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. తూప్రాన్ పురపాలికలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రెండు విడతలుగా ఇచ్చే వాటిని ఒకేసారికి కుదించారు. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. రామాయంపేటలో దుస్తులు ఇచ్చారు. మూడు నెలలుగా సామగ్రి ఇవ్వలేదు. ఇబ్బందులు తీరుస్తాం-రామకృష్ణారావు, కమిషనర్, నర్సాపూర్ వర్షాకాలానికి ముందు కార్మికులకు ఏటా సామగ్రి అందజేస్తాం. వారి ఇబ్బందులను మా దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తాం.

## కస్తూర్బాలకు ఇంటర్ వెలుగులు

సంగారెడ్డి : కస్తూర్బా విద్యాలయాల్లో పేద, అనాథ బాలికలు చదువుతారు. ఇక్కడ పదో తరగతి వరకు చదివిన బాలికలు కొన్ని చోట్ల ఇంటర్మీడియట్ లేకపోవడంతో విద్యకు దూరమవుతున్నారు. దీన్ని గుర్తించిన విద్యాశాఖ 2025-26 సంవత్సరానికి మరో ఏడు చోట్ల ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. కస్తూర్బాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలి.

**వసతి.. నాణ్యమైన విద్య..** కస్తూర్బా పాఠశాలల్లో ప్రత్యేకాధికారులు, బోధకులు తాత్కాలిక పద్ధతిన పనిచేస్తారు. ఈ విద్యాలయాల్లో వసతితో పాటు.. నాణ్యమైన విద్య అందిస్తున్నారు. ఇక్కడి విద్యార్థినులు 2024-25 విద్యా సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 62.72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 75.48 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇప్పటికే కస్తూర్బాల్లో ఇంటర్ అమలవుతుండగా.. తాజాగా మరో ఏడు చోట్ల అవకాశం కల్పించారు. కాశీపూర్, హత్నూర, తాటిపల్లి, న్యాల్‌కల్, పుల్‌కుర్తి, కంగ్టి, ఉస్మాన్‌నగర్‌లోనూ ఇంటర్ తరగతులు నిర్వహించనున్నారు. వీటిలో జూన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఒక్కో పాఠశాలకు 80 సీట్లు కేటాయిస్తారు. అనాథ, పేద బాలికలు వీటిలో చదువుకునే అవకాశం కల్పిస్తారు. కొత్త కోర్సులకు అవకాశం కస్తూర్బాల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు మాత్రమే అమలు చేసేవారు. వచ్చే ఏడాది నుంచి మరిన్ని కోర్సులు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఎంఎల్‌టీ, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కోర్సులు కూడా అందుబాటులోకి వస్తాయి.

# ఉత్తీర్ణత లక్ష్యం.. సన్నద్ధత

కరీంనగర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పెంచడంతోపాటు విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచి వారిని ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించేందుకు అధికారులు ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు. ఇంటర్ ఫలితాలు వెల్లడైన అనంతరం అవి కొంత నిరాశజనకంగా మారాయి. ఈ పరిస్థితిని అధిగమించి ఇంటర్‌లో అనుత్తీర్ణులైన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా వారిని సన్నద్ధం చేసే కార్యక్రమానికి అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతూ అనుత్తీర్ణులైన విద్యార్థులకు వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. వారు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దుతున్నారు.

**11 జూనియర్ కళాశాలల్లో..**

జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 3736 మంది ఇంటర్ పరీక్షలు రాశారు. వారిలో 1663 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 40.40, ద్వితీయ సంవత్సరంలో 47.60 ఉత్తీర్ణత శాతంగా నిల్చింది. పేద, మధ్యతరగతి కుటుంబాల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులే ఈ కళాశాలల్లో ఎక్కువగా చదువుతున్నారు. గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు నిత్యం కళాశాలలకు వచ్చేలా అధ్యాపకులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహించారు. అయినా మెజారిటీ కళాశాలల్లో ఆశించిన ఫలితాలు



రాలేదు.

**ప్రత్యేక తరగతులు..**

ఇంటర్ ఫలితాల్లో పలు సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. గత నెల 24 నుంచి జరుగుతున్న ఈ తరగతులు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా వారికి బోధనతోపాటు వారి సందేహాలను తీర్చడం, ముఖ్యమైన అంశాలను అర్థం చేయించడం, పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా అధ్యాపకులు వారిని తీర్చిదిద్దుతున్నారు. పాఠ్యాంశాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను అధ్యాపకులు వారి చరవాణి వాట్సప్‌లకు పంపిస్తున్నారు. అనుత్తీర్ణులైన ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులందరూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యాధికారి గంగాధర్ తెలిపారు.

# హెచ్‌ఎండీఏలా భావినగర అభివృద్ధి సంస్థ

హైదరాబాద్: భావినగరం అభివృద్ధికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ విధులు.. కార్యకలాపాలు హెచ్‌ఎండీఏ తరహాలో ఉండనున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 56 గ్రామాల్లో 765.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో భావినగరాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే భావినగర అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. హైదరాబాద్ మహానగర మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) తరహాలో ఫ్యూచర్‌సిటీని మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయనున్నారని అధికారులు, ప్రజలు భావించారు. ఇందుకు భిన్నంగా భావినగర అభివృద్ధి సంస్థను అభివృద్ధి కార్యకలాపాలకు పరిమితం చేసింది. 56 గ్రామాల్లో భవిష్యత్తులో రానున్న ఇళ్లు, పరిశ్రమలు, ఐటీ సంస్థలు, బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలకు సంబంధించిన లేఅవుట్లు, నిర్మాణాలకు అనుమతులు జారీచేయనుంది. ఫ్యూచర్‌సిటీలో ఉన్న గ్రామాల్లో పరిపాలన యథాతథంగా



కొనసాగనుంది.

**అధికారులు.. సిబ్బంది నియామకాలు**

భావినగర అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశాక కమిషనర్ సహా వివిధ హోదాల్లో 36మంది అధికారులు, సిబ్బంది నియామకాలకు సర్కారు అనుమతి ఇచ్చింది. సంస్థ కమిషనర్‌గా కొద్దిరోజుల క్రితం ఐఏఎస్ అధికారి కె.శశాంక బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతానికి అదనపు కమిషనర్‌తో సహా అధికారులు, సిబ్బందిని సాధారణ పరిపాలన, పురపాలక శాఖల నుంచి డిప్యూటేషన్ పద్ధతిలో తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

**ఉపాధికి అనర్హులవుతారని**

ఫ్యూచర్ సిటీలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల ప్రజలు వర్షాధారంపై పంటలు పండిస్తుంటారు. వీరికి ఉపాధి హామీ పథకం అమలవుతోంది. భావి నగరాన్ని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తే ఈ పథకానికి అనర్హులవుతారన్న భావనతో అధికారులు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు వద్దని ప్రభుత్వానికి విన్నవించగా సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారు. ఇటీవలే ఉన్నతాధికారులతో చర్చించి ఫ్యూచర్‌సిటీ విధివిధానాలు ఖరారు చేశారు.

# దివ్యంగా జీవించేలా..

హైదరాబాద్: దివ్యాంగుల ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు యూత్ ఫర్ జాబ్స్ అనే సంస్థతో కలిసి ప్రత్యేక జాబ్ పోర్టల్ ఏర్పాటు చేసింది. వివిధ వైకల్యాలతో బాధపడుతున్న వారు.. ప్రైవేటు పరిశ్రమల్లో సరైన ఉద్యోగ అవకాశాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటివారికి.. వారి వారి అర్హతలను బట్టి ఉద్యోగం ఇప్పించి, స్వశక్తితో జీవించేలా చూసేందుకు ఈ పోర్టల్ దోహద పడుతోంది. పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకుంటే, విద్యార్హతలు, సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని సరిపడే ఉద్యోగాన్ని కల్పిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క 8 నెలల కిందట ఈ పోర్టల్‌ను ప్రారంభించారు. ప్రైవేటు ఉద్యోగాల కోసం దివ్యాంగులు ఆయా సంస్థల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అంతర్జాలం సాయంతో నేరుగా దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. %https://pwdjobportal.telangana.gov.in% లో విద్యార్హతలు, ఇతర నైపుణ్యాలను నమోదు చేయాలి. నేరుగా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగులు శాఖ సంచాలకుడి కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు.

# 'కాసు'క్కూర్చున్నారు



హైదరాబాద్ : దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలో లంచం ఇవ్వనిదే పని కావట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు చేయిచాస్తుంటారనే మాటలు వినిపిస్తున్నాయి. ఇటీవల అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కుతుండటమే ఇందుకు నిదర్శనం. కొందరు అధికారులు రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటూనే లంచాల కోసం కాసుక్కూర్చుంటున్నారు.

**ఫోన్ నంబరు ఉన్నా**

అడిగితే ఫిర్యాదు చేసేందుకు 040-23454884/7680901912 నంబర్లు కేటాయించారు. ప్రారంభంలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి ముగ్గురిపై చర్యలు తీసుకున్నారు. ఏమైందో ఏమో ఆ తరువాత అవినీతికి పాల్పడుతున్న వారిపై పెద్దగా చర్యలు లేకపోవడంతో వినియోగదారుల్లోనూ విశ్వాసం కొరవడింది. చివరికి అనిశాను ఆశ్రయించి అవినీతి అధికారులను పట్టిస్తున్నారు.

**నిబంధనల మేరకు ఉన్నా సరే..**

కొత్త కనెక్షన్, మీటర్ జారీ, లైన్ల మార్పిడి, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు, అదనపులోడు కేటాయింపు, తగ్గింపు వరకు విద్యుత్తు సంస్థలో ఏ పని కావాలన్నా పైకం సమర్పించుకోవాల్సిందే. ఫైల్‌ను బట్టి రూ.30వేల నుంచి రూ.3 లక్షలు వసూలు చేస్తున్నారు. గచ్చిబౌలి, జీడిమెట్ల, కూకట్‌పల్లి, ఇబ్రహీంబాగ్, పటాన్‌చెరు తదితర డివిజన్లలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కింది నుంచి కార్పొరేట్ కార్యాలయం వరకు కొందరు వాటాలు పంచుకుంటున్నారు. అవినీతిని అరికట్టేందుకు ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చినా వినియోగదారులు కలిసే వరకు దస్త్రం కదలదు. అన్నీ సరిగా ఉన్నా ఏదో పేరుతో కొర్రీలు వేస్తుంటారు.

**ఇటీవల ఘటనల్లో..**

కొత్త భవనానికి ట్రాన్స్‌ఫార్మర్, మీటర్ కనెక్షన్ల మంజూరుకి రూ.50వేలు డిమాండ్ చేసి రూ.10వేలు తీసుకుంటుండగా ప్రగతినగర్ ఏఈ జ్ఞానేశ్వర్ అనిశాకు దొరికారు.

అంబర్‌పేటలో కనెక్షన్ కోసం అసిస్టెంట్ లైన్‌మెన్ శివ మల్లేష్ రూ.50వేలు అడిగారు. అతడి సహాయకుడు డబ్బులు తీసుకుంటుండగా చిక్కాడు. గత నెలలో మంగళ్‌హాట్‌లో ఆర్టిజన్ రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.

ఫిబ్రవరిలో రూ.75 వేల లంచం తీసుకుంటూ గచ్చిబౌలి సబ్ డివిజన్ ఏడీఈ సతీష్ ఏసీబీకి చిక్కారు. ఆ తర్వాత ఆయన ఇంటిలో చేసిన సోదాల్లో రూ.కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టినట్లు వెల్లడైంది.

**సేవల్లో పారదర్శకత కొరవడి..**

కొత్త కనెక్షన్‌కు ఎంత డిపాజిట్ చెల్లించాలి వంటి మినహా మిగతా పనులకు సంబంధించి ఎంత ఖర్చు అవుతుంది? అనే వివరాలు ఎక్కడా ఉండవు. ఎవరైనా వినియోగదారుడు వెళ్లి సమాచారం అడిగినా చెప్పేవారు ఉండరు. చేసేది లేక మధ్యవర్తులను ఆశ్రయించి వినియోగదారులు జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు.

# ప్రీపెయిడ్ మీటర్లకు మంగళం..!

నల్గొండ : అధునాతన ఎలక్ట్రానిక్ ఎనర్జీ (ప్రీపెయిడ్) మీటర్ల వ్యవస్థ నల్గొండ జిల్లాలో అటకెక్కింది. విద్యుత్తు సంస్కరణలో భాగంగా పంపిణీలో నష్టాలు, బకాయిలు పెరిగిపోకుండా వంద శాతం బిల్లులు వసూలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుకు 2020లో శ్రీకారం చుట్టింది. ముందుగానే డబ్బు చెల్లించి విద్యుత్తు వినియోగించే మీటర్లను ప్రయోగాత్మకంగా ముందుగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు బిగించాలని నిర్ణయించింది. విజయవంతం అయితే ఇంటింటికీ 2025 నాటికి స్మార్ట్ ఎనర్జీ మీటర్లు అమర్చాలని ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వాల కార్యాలయాలకు ఏర్పాటు చేయడంతో పాటు 15 శాతం విద్యుత్తు నష్టం జరుగుతున్న ప్రాంతాల్లో 850 ప్రీపెయిడ్ విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఈ మీటర్ల వ్యవస్థ మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది.

**నిర్వహణలో అధికారులు విఫలం**

ప్రీపెయిడ్ మీటర్ల నిర్వహణలో విద్యుత్తు సంస్థ అధికారులు విఫలం అయ్యారు. మీటర్ల వినియోగంపై సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇవ్వకపోవడంతో పాటు తరచూ మీటర్లు మొరాయిస్తున్నాయి. సరిచేసే నాథుడే లేక పాత పద్ధతిలో బిల్లులు వసూళ్లు చేస్తున్నారు. మరో పక్క ముందుగా బిల్లులు చెల్లించే పరిస్థితుల్లో ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడంతో ప్రీపెయిడ్ మీటర్ల వ్యవస్థకు మంగళం పాడారనే విమర్శలు వస్తున్నాయి. పాత పద్ధతిలో విద్యుత్తు బిల్లులు వసూలు చేయడంతో ఒక నల్గొండ జిల్లాలోనే ప్రభుత్వ కార్యాలయాలు సుమారు రూ.129 కోట్లు విద్యుత్తు సంస్థకు చెల్లించాల్సి ఉంది. ప్రీపెయిడ్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తే విద్యుత్తు బిల్లులు రూపంలో సంస్థకు బకాయిలు లేకుండా ఆదాయం సమకూరే అవకాశం ఉన్నా.. సంస్థ అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. దీనిపై సంస్థ ఎస్ఈ వెంకటేశ్వర్లను చరవాణి ద్వారా 'న్యూస్‌టుడే' సంప్రదిస్తే అందుబాటులోకి రాలేదు.

# పూడిక పెరిగి.. సామర్థ్యం తగ్గి



జగిత్యాల : వృథాగా 140 టీఎంసీలు

ప్రాజెక్టు: శ్రీరామసాగర్ ప్రాజెక్టు

నిర్మాణ సమయంలో గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం: 112 టీఎంసీలు

ప్రస్తుతం నిల్వచేస్తున్న నీరు: 80.501 టీఎంసీలు

ఉమ్మడి జిల్లాకు ప్రధాన నీటివనరైన శ్రీరామసాగర్ జలాశయంలో పూడిక పేరుకుపోయి గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం ఏటికేడు తగ్గుతోంది. వానాకాలంలో ఎస్సారెస్పీలోకి 287 టీఎంసీల వరదనీరు రాగా నిల్వసామర్థ్యం లేనందున దాదాపు 140 టీఎంసీలకుపైగా నీటిని మిగులు జలాలుగా గోదావరిలోకి వదలాల్సివచ్చింది. ఈ నేపథ్యంలో రూ.1,570 కోట్ల నిధులతో శ్రీరామసాగర్‌లో పూడికతీతను చేపట్టాలి. ప్రస్తుతం ప్రాజెక్టు వరదగేట్లను తెరుస్తున్నా గేట్లకిందుగా పూడికను తొలగించే స్లూయిస్‌గేట్లను తెరిచేలా చర్యలు చేపడితే దీర్ఘకాలిక ప్రయోజనాలుంటాయి. రూ.వెయ్యి కోట్లతో ప్రాజెక్టు పరిధిలో కాలువల లైనింగ్, తూములు, షట్టర్లు, డ్రాపుల మరమ్మతు చేపట్టాలి.

రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాజెక్టులలో పేరుకున్న పూడికను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు ప్రధానంగా సాగునీరందించే ప్రాజెక్టుల్లోనూ పూడికను తొలగించి వాననీటిని నిల్వచేస్తేనే సాగుకు సుస్థిరత సిద్ధిస్తుంది. మన ప్రాంత తలసరి నీటి లభ్యత 1400 క్యూబిక్ మీటర్లుగా ఉంటే వాడకం 801 క్యూబిక్ మీటర్లు మాత్రమే కాబట్టి అన్ని ప్రాజెక్టుల్లోనూ పూడికతీత, మరమ్మతు చేపట్టి వాననీటి నిల్వ, వినియోగ సామర్థ్యాన్ని పెంచటం అవశ్యంగా మారింది.

ఎత్తిపోతలకు ప్రధానం..

శ్రీపాద ఎల్లంపల్లి

23 టీఎంసీలు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల నుంచి లక్ష్మీ, సరస్వతీ, పార్వతీ పంపుహౌస్‌ల ద్వారా ఎత్తిపోసిన నీటినిల్వతో పాటు ఎగువ నుంచి వచ్చే వరదనీటి నిల్వకు ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రధాన ఆదరువుగా ఉంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు మరమ్మతు ఆవశ్యకత ఉండటంతో ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులోనే నీటిని నిల్వచేసి నంది, గాయత్రీ పంపుహౌస్‌లద్వారా శ్రీరామసాగర్, మధ్యమానేరు, దిగువమానేరు, అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లలోకి తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో నూతన ప్రాజెక్టు కాబట్టి పూడిక అంతగా లేకుండా ప్రాజెక్టు నిర్వహణ తదితరాలకు రూ.50 కోట్లవరకు నిధులు కేటాయించాల్సి ఉంది.

రూ.100 కోట్లు అవసరం

మధ్యమానేరు

30 టీఎంసీలు

28 టీఎంసీలు

మధ్యమానేరు జలాశయం నూతనంగా నిర్మించిన ప్రాజెక్టు కాబట్టి పూడిక తక్కువగానే ఉంది. శ్రీరామసాగర్ వరదకాలువ, మానేరు వాగు ద్వారా వచ్చే నీటినిల్వకు, అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ తదితర ప్రాజెక్టులకు నీటిని తరలించే ప్రధాన జలాశయం కాబట్టి మధ్యమానేరులో పూడికతీత అత్యంత అవశ్యంగా మారింది. దాదాపు రూ.100 కోట్ల నిధులతో పూడికతీతతో పాటు ప్రాజెక్టు పరిధిలో మరమ్మతు చేపట్టాల్సి ఉంది.

అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టు

దిగువమానేరు

26 టీఎంసీలు

24 టీఎంసీలు దిగువ మానేరులో ప్రస్తుతం నీటినిల్వ 24 టీఎంసీలుగా పేర్కొంటున్నా 22 టీఎంసీలకు తగ్గినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. శ్రీరామసాగర్ నుంచి ఎల్ఎండీ ఎగువ వరకు ఒక నీటి విడుదల షెడ్యూల్ ఉండగా ఎల్ఎండీ దిగువన కరీంనగర్, పూర్వపు వరంగల్, నల్గొండ జిల్లాలకు మరో షెడ్యూల్ ఉంటుంది. కాబట్టి అత్యంత ముఖ్యమైన ఎల్ఎండీలో రూ.350 కోట్లతో పూడికతీతతో పాటు ప్రాజెక్టు పరిధిలో కాలువల లైనింగ్, ఇతర మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

# నగరం అప్రమత్తం

హైదరాబాద్: దేశ సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. రాజధానిలో ఇప్పటికే భద్రత పెంచిన పోలీసులు.. అసాంఘిక శక్తులు, అక్రమ చొరబాటు దారుల కార్యకలాపాలపై దృష్టిసారించారు. ముఖ్యంగా బంగ్లాదేశ్, రోహింగ్యాలపై నిఘా పెట్టారు. వారు ఎక్కడెక్కడ ఉంటున్నారు..? ప్రస్తుతం ఏం చేస్తున్నారు..? అనే కోణంలో పోలీస్‌స్టేషన్ల వారీగా స్థానికుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. నగరంలో జరిగే మిస్ వరల్డ్ పోటీలకు వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారు. ఆపరేషన్ సిందూర్ దృష్ట్యా అవాంఛనీయ ఘటనలకు అవకాశం



లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ పోటీల్లో భాగంగా ఈ నెల 13న చార్మినార్ దగ్గర హెరిటేజ్ వాక్ నిర్వహిస్తున్నారు. పోలీసులు ఈ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నారు.

**పెరిగిన గస్తీ** దేశంలోకి అక్రమంగా చొరబడిన బంగ్లాదేశీయులు నగరంలో తలదాచుకుంటున్నారు. వందలాది మంది నకిలీ జనన ధ్రువపత్రాలు, ఆధార్ సంపాదించి నివాసముంటున్నారు. బాలాపూర్ సహా కొన్ని ప్రాంతాల్లో 5 వేల మందికిపైగా ఉంటున్నట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. కొందరు అధికారికంగా దేశంలోకి వచ్చి వీసా గడువు ముగిసినా ఇక్కడే మకాం వేశారు. ఆపరేషన్ సిందూర్ తరువాత హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులు సమన్వయం చేసుకుంటూ పరిస్థితుల్ని గమనిస్తున్నారు.

# ముగిసిన ఎల్‌ఆర్‌ఎస్ గడువు



హైదరాబాద్: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గడువు ముగిసింది. ఎలాంటి రాయితీ లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించవచ్చని అధికారులు తెలిపారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కింద రూ.218 కోట్ల ఆదాయం సమకూరింది. ఇటీవల పెంచిన మూడు రోజుల గడువు కూడా ముగియడంతో ఇక నుంచి ఫీజులపై రాయితీ ఉండదని అధికారులు తెలిపారు.

**ప్రొసీడింగ్స్ కోసం నిరీక్షణే...**కొందరు ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించి రెండు నెలలు గడిచినా ప్రొసీడింగ్స్ కోసం ఇంకా ఎదురుచూడాల్సిన పరిస్థితి. క్షేత్రస్థాయిలో హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో ఇప్పటికీ ఎల్1 అనుమతుల్లో జాప్యం కొనసాగుతోంది. ఎల్‌ఆర్‌ఎస్ ప్రారంభమైనప్పటి నుంచి గడువు ముగిసే వరకు హెచ్‌ఎండీఏ పరిధిలో 70 వేల మందిపైనే రుసుము చెల్లించగా...కేవలం 4 వేల వరకు మాత్రమే ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రుసుము చెల్లించిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలను తొలుత క్షేత్రస్థాయిలో (ఎల్1 క్లియరెన్సు) పరిశీలిస్తారు. తొలుత రెవెన్యూ నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ నుంచి ఏఈ, తర్వాత హెచ్‌ఎండీఏ నుంచి జేపీవో లేదా ఏపీవో పరిశీలించి నివేదికను అనుమతులకు పంపిస్తారు. ఇప్పటికే ఎల్1 తనిఖీలు పూర్తయినా ఇంకా ప్రొసీడింగ్స్ కోసం చాలామంది హెచ్‌ఎండీఏ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఫీజు చెల్లించిన వారందరికీ నెల రోజుల్లో ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

**వివరాలు ఇలా..**

రుసుము నోటీసులు ఇచ్చిన దరఖాస్తులు 2,04,600

రుసుము చెల్లించిన వారు 70,600

జారీ చేసిన ప్రొసీడింగ్స్ 4,936

హెచ్‌ఎండీఏకు వచ్చిన ఆదాయం రూ.218 కోట్లు

# ఎక్కడిదో వ్యర్థం.. దారెంట దుర్గంధం



చివ్వెంల : పరిశ్రమలు ఎక్కడివో.. నిషేధిత రసాయన వ్యర్థాలను మాత్రం ఇక్కడ పడేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు వాహనాలలో తీసుకొచ్చి రోడ్ల వెంట బహిరంగంగా పారబోస్తుండడంతో పరిసర గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దుర్వాసన భరించలేక, శ్వాసకోస సంబంధిత వ్యాధులొస్తాయని ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు అధికారులు సంబంధిత వ్యక్తులను, వాహనాలను అదుపులోకి తీసుకొని కేసులు సైతం నమోదు చేసినా వికృత చేష్టలు ఆగడంలేదు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చొరవ తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

**శుభ్రపరిచే చర్యలు చేపట్టకనే..**పలు రసాయన పరిశ్రమలలో హానికర అవశేషాలు బయటకు రావడం సహజం. వాటిని అదే పరిశ్రమలో శుభ్రపరిచి (ట్రీట్మెంట్) చేసి అదే పరిశ్రమలో ఉంచుకోవాలి. లేదంటే వాటిని నిర్వహించే ప్రత్యేక ప్రదేశాలకు పంపించాలి. ఇందుకు ఖర్చు ఎక్కువగా వస్తున్నందున యాజమాన్యాలు ఇలా రోడ్ల వెంట పడేసి సులువుగా చేతులు దులుపుకొంటున్నారు.

# వ్యవసాయానికి వాడే విద్యుత్తు 1 శాతమే!

ఇతర వర్గాల వినియోగదారులతో పోల్చితే భద్రాద్రి జిల్లాలో వ్యవసాయానికి వాడుతున్న విద్యుత్తు ఒక్క శాతమేనని విద్యుత్తుశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఐదేళ్లలో వ్యవసాయానికి వినియోగించిన విద్యుత్తు వార్షిక సగటు వృద్ధి 20.36 లక్షల యూనిట్లుగా నమోదైంది. గృహాలకు 1,131.10, గృహేతర(వాణిజ్య) 779.85, పరిశ్రమలు 53.54, వీధిదీపాలు, నీటి సరఫరా 107.74, ప్రార్థన మందిరాలు, పాఠశాలలల్లో 100.97 లక్షల యూనిట్ల వార్షిక సగటు వృద్ధి కనిపించింది. జిల్లాలో 2020-21లో 20,671.16లక్షల యూనిట్ల విద్యుత్తు డిమాండ్ ఉండగా 2024-25 నాటికి 31,787.93లక్షల యూనిట్లకు చేరింది.

**మీటర్ రీడింగ్‌లు లేకపోవటంతో..**

జిల్లాలో 2020-21లో 20,671.16లక్షల యూనిట్లలో 226.28లక్షల యూనిట్ల (1.09%) విద్యుత్తును వ్యవసాయానికి వినియోగించారు. 2024-25లో 31,787.93లక్షల యూనిట్లలో 330.79లక్షల యూనిట్ల(1.04%) విద్యుత్తును వ్యవసాయానికి



వాడారు. గత ఐదేళ్లలో వ్యవసాయానికి వాడిన విద్యుత్తులో 104.51లక్షల యూనిట్ల వృద్ధి నమోదైంది. అయినప్పటికీ మొత్తం వినియోగంలో వ్యవసాయం వాటా ఒక్క శాతంగానే ఉంది. అయితే వ్యవసాయానికి వాడే విద్యుత్తు విషయంలో స్పష్టమైన మీటర్ రీడింగ్‌లు లేకపోవటం, ఒక్క కనెక్షన్‌పై ఎక్కువ మోటార్లు వినియోగించటం తదితరాల వల్ల తక్కువగా నమోదవుతోందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

**పరిశ్రమలకు తగ్గింది..**

ఐదేళ్లుగా జిల్లాలో పరిశ్రమలకు వినియోగించే విద్యుత్తు వాటా శాతం తగ్గుతూ వస్తోంది. 2020-21లో 1,324.21లక్షల యూనిట్ల కరెంట్(మొత్తం వినియోగంలో 6.40%) పరిశ్రమలకు వాడితే.. 2024-25నాటికి అది 1,591.93లక్షల యూనిట్లకు పెరిగినప్పటికీ మొత్తం వినియోగంతో(31,787.93) పోల్చితే 5శాతానికి తగ్గింది. జిల్లాలో ప్రధాన పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూతపడటం, ఆశించిన స్థాయిలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకాకపోవటమే దీనికి కారణమని తెలుస్తోంది.

**పెరిగిన వాణిజ్య సముదాయాల వాటా**

జిల్లాలో అత్యధిక విద్యుత్తు వినియోగం వాటా గృహాలదే. 2020-21లో 20,671.16లక్షల యూనిట్లలో 12,394.36లక్షల యూనిట్లు (60%) గృహ అవసరాలకే వాడారు. 2024-25నాటికి గృహ వినియోగం 18,049.90లక్షల యూనిట్లకు పెరిగినప్పటికీ మొత్తం విద్యుత్తు వాడకం (31,787.93లక్షల యూనిట్ల)లో గృహాల వాటా 56.80శాతానికే పరిమితమైంది. ఇదే సమయంలో గృహేతర(వాణిజ్య) విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. 2020-21లో 4,888.08లక్షల యూనిట్లు(మొత్తం వినియోగంలో 23.65%) ఉ

# అందని ద్రాక్షగా త్రీఫేజ్ విద్యుత్తు

ఉట్నూరు: వ్యవసాయానికి అవసరమైన త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యాన్ని గిరిజన రైతులకు ఉచితంగా అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. అటవీశాఖ అభ్యంతరాలతో పనులు ముందుకు సాగడం లేదు. ఉమ్మడి జిల్లాలోని 180 గ్రామాలు రిజర్వు అటవీ ప్రాంతంలో ఉన్నాయని వాటిలో పనులు చేయడానికి అనుమతి లేదని అటవీశాఖ అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లాలో రూ.3.71కోట్లతో చేపట్టిన ఈ పథకంపై కథనం.

'గిరివికాసం' పథకంలో గిరిజన రైతులకు ఉచితంగా బోరు, మోటారు అందజేయడం, ఐటీడీఏ ఆధ్వర్యంలో విద్యుత్తు సంస్థ ద్వారా గిరిజన గ్రామాలకు త్రీఫేజ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టింది.

చేపట్టాల్సిన పనులివే..

ఉచిత త్రీఫేజ్ విద్యుత్తు కనెక్షన్ల కోసం ఎంపిక చేసిన గ్రామాలలో ఆదివాసీ గిరిజన రైతుల చేనుల వరకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం కల్పించాలి. అవసరమైన స్తంభాలు ఏర్పాటు చేయడం, కొత్తగా తీగలు అమర్చడం, ముగ్గురు, నలుగురు రైతులుంటే వారికి 25 కేవీఏ, అయిదు నుంచి పది మంది వరకు ఉంటే 63కేవీఏ, పది నుంచి 100 మంది రైతులుంటే 100కేవీఏ నియంత్రికలను ఏర్పాటు చేయాలి. అవసరమైన నిధులను ఐటీడీఏ ద్వారా నేరుగా తెలంగాణ ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ(టీఎస్ఎన్‌పీడీసీఎల్)కు చెందిన అధికారులకు డీడీల రూపంలో చెల్లిస్తోంది.

ఇదీ వరుస.. ఉట్నూరు మండలం శాంతాపూర్, ఎర్రగుట్ట, హీరాపూర్, బాబాపూర్ గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉన్నాయని అక్కడ పనులు చేయడానికి అనుమతి లేదని అటవీశాఖ పనులను అడ్డుకుంది.

ఇచ్చోడ మండలం బాబాజీపేట్, గోండుగూడ గ్రామాలలో పనులు నిలిచిపోయాయి.సిరికొండ మండలం భీంపూర్, చినయంగూడ, చింతగూడ, రాంనగర్ గ్రామాలలోనూ ఇదే పరిస్థితి.

కెరమెరి, తిర్యాణి, సిర్పూరు(యు) మండలాలలోని గ్రామాలలో అటవీశాఖ పనులను అడ్డుకుంది.

నిర్మల్ జిల్లా పెంబి, మిద్దెచింత, గండిగోపాల్‌పూర్, జంగుగూడ, కోలాంగూడలో నిలిచిపోయాయి.

కుమురం భీం జిల్లా బెజ్జూర్, దహెగాం, కెరమెరి మండలాలలోని రెబ్బెన, కొతిమీర్, అనార్‌పల్లి గ్రామాలలో పనులు ముందుకు సాగడంలేదు.మంచిర్యాల జిల్లా కోటపల్లి, నెన్నెల మండలాల్లో కోనంపేట, అల్లన్, బోగంపల్లి గ్రామాలలో పనులు నిలిచిపోయాయి.

ఈయన ఉట్నూరు మండలం శాంతాపూర్‌కు చెందిన ఆదివాసీ రైతు మాన్కు. మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. త్రీఫేజ్ కరెంటు సదుపాయం లేక వర్షాధారంగా సేద్యం చేయాల్సిన పరిస్థితి. గ్రామానికి త్రీఫేజ్ కరెంటు సౌకర్యం మంజూరైనా అనుమతి లేదని అటవీశాఖ పనులను అడ్డుకుంది. చేనులో వేసిన బోరును చూపిస్తున్న ఈ గిరిజన రైతులు రెడ్డి పోశయ్య, లస్మయ్య. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కోనంపేటకు చెందిన వారు. గిరి వికాసం పథకంలో ప్రభుత్వం వీరికి ఉచితంగా బోరు వేయించింది. త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించేందుకు పనులు చేపట్టగా అటవీశాఖ అభ్యంతరంతో పనులు నిలిచిపోయాయి.

# అనుమతులు తుస్సు.. కాలుష్యం బుస్సు



హైదరాబాద్: పర్యావరణ అనుమతుల్లేకుండానే (ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్) పైలట్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. బాహ్యవలయ రహదారి పరిధిలో ఫార్మా, బల్క్‌డ్రగ్, బల్క్‌డ్రగ్ మధ్యంతర ఉత్పత్తుల ఆర్అండ్‌డీ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్-కమర్షియల్) యూనిట్లను ఏర్పాటు చేయొద్దనే ఉత్తర్వులున్నా.. పరిశోధనల్లో ఉత్పత్తి సామర్థ్యం రోజుకు ఒక కేజీకి మించొద్దని చెబుతున్నా.. వందల లీటర్ల రియాక్టర్ల సామర్థ్యంతో ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. దీంతో నాచారం, మల్లాపూర్, బాలానగర్ ఐడీఏ, పైప్‌లైన్‌రోడ్ మార్గంలో రసాయన వ్యర్థజలాలు పోటెత్తి అక్కడి జలాశయాలు కాలుష్యకాసారాలుగా మారుతున్నాయి. అనుమతుల్లేకుండా పైలట్ ప్లాంట్ నడుపుతున్న నాచారంలో క్యూర్‌డ్రగ్స్ అనే ఓ ఫార్మా కంపెనీపై పీసీబీ ఇటీవల చర్యలు తీసుకోవడమే ఇందుకు నిదర్శనం.

**2018లో ప్రభుత్వ ఉత్తర్వులు..**

కాలుష్యకారక పరిశ్రమలను అవుటర్ అవతలికి తరలించేందుకు 2018జనవరి20న జీవోఎంఎస్-4 ద్వారా అప్పటి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రెడ్, ఆరెంజ్ కేటగిరీల పరిశ్రమల వివరాలు వాటి ఏర్పాటులో పరిమితులను అందులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కి తరలించకుండా నేరుగా జలాశయాలకు, డ్రైనేజీకి కలుపుతుండటంతో భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. బల్క్‌డ్రగ్, ఫార్మా యూనిట్ల (రెడ్, ఆరెంజ్ కేటగిరీ)తో పాటు ఇతర పరిశ్రమల నిర్వాహకులు కేవలం జీఎస్టీ, మున్సిపల్, పరిశ్రమల నుంచి అనుమతులు తీసుకుంటున్నారు. పీసీబీ నుంచి అనుమతులు తీసుకుంటే సభ్యత్వం, సీఈటీపీకి వ్యర్థ జలాల తరలింపునకు ఖర్చు పెరుగుతుందని భావిస్తుండటంతో విపరీతంగా కాలుష్యం నమోదవుతోంది. మూడు నుంచి నాలుగు అంతస్తుల్లో పైన ఆర్అండ్‌డీ యూనిట్లు, కింద పైలట్‌ప్లాంట్‌లు పెట్టి పర్యావరణ అనుమతులు లేకుండానే వ్యాపారం సాగిస్తున్నారు. మల్లాపూర్, నాచారం, చర్లపల్లి, ప్రశాంత్‌నగర్, ప్రగతినగర్ రాజీవ్‌నగర్, గాంధీనగర్, జీడిమెట్ల, మేడ్చల్, హయత్‌నగర్‌లో ఈ తరహా పైలట్‌ప్లాంట్‌లు ఎక్కువగా నడుస్తున్నాయి.

**భారీగా జరిమానాలు..**

పర్యావరణ అనుమతులు లేకపోతే పరిశ్రమ ఏర్పాటుకు చేసిన పెట్టుబడిలో 30శాతం వరకూ జరిమానా విధించే ఆస్కారం ఉంది. అనుమతుల్లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నా పీసీబీ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. మున్సిపల్, జీఎస్టీ, పరిశ్రమలశాఖ నుంచి అనుమతులు తీసుకున్న జాబితాను పరిశీలిస్తే ఎక్కడ, ఎవరు ఏఏ పరిశ్రమలు ఉత్పత్తులు సరఫరా చేస్తున్నారో తెలిసే అవకాశం ఉంటుంది. ఆ జాబితా ఆధారంగా యూనిట్లలో తనిఖీలు చేస్తే భారీ స్థాయిలో జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది.

# లక్ష్యానికి దూరం.. అపార్



బొంరాస్‌పేట: జాతీయ విద్యా విధానం ప్రకారం దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులందరికీ ప్రత్యేక గుర్తింపు కార్డును రూపొందించడానికి అపార్ కార్డును జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'ఒకే దేశం-ఒకే విద్యార్థి' అనే లక్ష్యంతో కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు ఆధార్ కార్డు తరహాలో 12 అంకెలతో అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) సంఖ్యను కేటాయించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈ ప్రక్రియను గత ఏడాది నవంబరులో ప్రారంభించగా విద్యా సంవత్సరం ముగుస్తున్నా విద్యార్థులందరి వివరాలను నమోదు చేయలేకపోయారు.

**హెచ్ఎంలతో అవగాహన కల్పించినా..**

అపార్ ఐడీ జనరేట్‌లో పలు ఇబ్బందులు ఎదురవుతున్నందున పాఠశాలలు పూర్తిస్థాయిలో లక్ష్యం చేరుకోలేకపోతున్నాయి. జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల హెచ్ఎంలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి అపార్ నమోదుపై అవగాహన కల్పించారు. అయినా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. అపార్ కార్డు ద్వారా కేటాయించే సంఖ్య విద్యార్థికి జీవితకాలం ఐడీగా పరిగణిస్తారు. వివరాలు పూర్తి గోప్యంగా ఉంటాయి. దీనిని రూపొందించడానికి విద్యార్థి తల్లిదండ్రుల అంగీకారం తప్పక తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

**ఇవీ ఎదురవుతున్న ఇబ్బందులు**

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ పాఠశాలలో, ఆధార్ కార్డులో ఒకేవిధంగా ఉండాలి. ఏ ఒక్క అక్షరం తేడా ఉన్నా నమోదు కావడం లేదు. తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను రికార్డుల్లో రాయించే సమయంలో పేరు, పుట్టిన తేదీ ఒకలా రాయించి ఆధార్ నమోదు సమయంలో మరో విధంగా రాయించారు.

పుట్టిన తేదీ మార్చుకోవాలంటే ఆధార్ సెంటర్‌లో జనన ధ్రువీకరణ పత్రాలు అడుగుతున్నారు. చాలామంది వద్ద ఇవి లేవు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు.. 1,066

ప్రైవేటు.. 198

మొత్తం విద్యార్థులు.. 1,53,169

ఇప్పటివరకు అపార్ ఐడీ నమోదు.. 88,719

ఎన్నో ఉపయోగాలు

విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

అపార్ గుర్తింపుతో డిజీ లాకర్‌కు అనుసంధానమవుతారు. విద్యా సంబంధ విషయాలు, ధ్రువపత్రాలు డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరుచుకోవచ్చు.

ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రయోజనాలు, వివిధ విద్యా సంస్థల్లో చేరికలు, మార్పులు, ఉద్యోగాల భర్తీ సమయం ఇతర సందర్భాల్లో సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించేలా కార్డును రూపొందిస్తారు.

# సాగర్ ఆయకట్టుకు సాగునీరు బంద్



ఖమ్మం : జిల్లాలో సాగర్ కాలువకు సాగునీటి సరఫరా గురువారం అర్ధరాత్రి నుంచి బంద్ చేశారు. రబీ సీజన్‌లో పంటల సాగుకు ఏప్రిల్ 24 వరకు అందిస్తుంటారు. ఈ ఏడాది అలాగే ఇస్తామని మొదట నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. సాగర్ జలాశయంలో నీటిమట్టం తగ్గుతున్నందున వేసవిలో హైదరాబాద్ నగరం సహా వివిధ జిల్లాలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలనే ఉద్దేశంతో 14 రోజుల ముందుగానే సాగునీటి సరఫరా ఆపేశారు. సాగర్ జలాశయం వద్ద ఎడమ కాలువకు నీటి విడుదల ఆపేయగా, అర్ధరాత్రి పాలేరు రిజర్వాయర్ అవుట్ ఫాల్ నుంచి దిగువకు నీటి విడుదల నిలిపేశారు. పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం 23 అడుగులకు చేరగా.. వైరా రిజర్వాయర్ పూర్తిగా నిండింది. సాగర్ కాలువల పరిధిలో సుమారు 300కు పైగా చెరువులకు వారం రోజులుగా నీటిని అందించగా.. నీటిమట్టం పెరిగింది. పాలేరు పాత కాలువ కింద ఆయకట్టుకు కొన్ని రోజులు నీటిని విడుదల చేయనున్నారు. 21 ఎంబీసీ, 16, 17 (నందిగామ), బోనకల్లు, మధిర బ్రాంచి కాలువలు సహా అన్ని మేజర్, మైనర్ కాలువలకు నీటి సరఫరా నిలిచిపోయింది. వైరా మండలం రెబ్బవరం గ్రామంలో సుమారు 100 ఎకరాల్లో వరి పంట పొట్ట దశలో ఉందని, స్థానిక వనరులతో పంట కాపాడుకోవాలని అక్కడి రైతులకు అధికారులు సూచించారు. జిల్లావ్యాప్తంగా సాగర్ ఆయకట్టులో మొక్కజొన్న, వరి పంటలు కోతకొచ్చాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో సాగర్ ఆయకట్టుకు విజయవంతంగా సాగునీరు సరఫరా చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల బంద్ చేసినట్లు జలవనరులశాఖ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు తెలిపారు.

# వన్యప్రాణులకు ప్రత్యేక వంతెనలు

ఆదిలాబాద్ : మనుషుల అవసరాల కోసం అడవుల మధ్య నుంచి రోడ్లు వేసుకుంటే.. జంతువులకు ఇబ్బంది కదా! అందుకే వాటి తోవలను వాటికి వదిలేస్తూ.. రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. అటవీ ప్రాంతాల్లో రోడ్లు దాటుతున్న సమయంలో వాహనాలు తగిలి వన్యప్రాణులు చనిపోతున్నాయని గుర్తించిన ప్రభుత్వం జంతువులు ఎక్కువగా దాటే జాతీయ రహదారులపై ఓవర్‌పాస్, అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతోంది. ఇలాంటి వంతెనలు తెలంగాణలో తొలిసారిగా మంచిర్యాల-చంద్రాపూర్(63), జగిత్యాల - భీవండి(61) జాతీయ రహదారులపై జంతువుల కోసం ప్రత్యేకంగా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

**జంతువుల సంరక్షణే ధ్యేయంగా..**

మహారాష్ట్ర నుంచి తెలంగాణ అటవీ ప్రాంతానికి జంతువుల రాకపోకలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రెండు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి మీదుగా జంతువులు వెళుతుంటాయి. ఇందులో భాగంగా వన్యప్రాణుల రాకపోకలతో పాటు వాటికి ప్రమాదం జరగకుండా ఉండేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా మంచిర్యాల - చంద్రాపూర్ జాతీయ రహదారిపై వాంకిడి సమీపంలో రూ.30 కోట్ల వ్యయంతో పర్యావరణ వంతెన(ఓవర్‌పాస్ ఎకో బ్రిడ్జి) నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కింది నుంచి వాహనాలు వెళ్తుంటే పైనుంచి జంతువులు వెళ్లేలా దీన్ని నిర్మిస్తున్నారు. తాజాగా మహారాష్ట్రలోని భీవాండి నుంచి తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిపై జంతువుల సంరక్షణను దృష్టిలో పెట్టుకొని ఖానాపూర్ పరిధిలో అండర్‌పాస్ వంతెనల నిర్మాణం జరుగుతోంది.

ఏటా 3 వేల జంతువుల మరణం

రోడ్డు దాటే సమయంలో చనిపోతున్న జంతువులపై మహారాష్ట్రకు చెందిన అశ్వమేధ ప్రతిష్ఠాన్ అనే సంస్థ సర్వే నిర్వహించింది. జాతీయ



రహదారి పొడవునా మహారాష్ట్రలోనే మూడు వేల జంతువులు చనిపోతున్నాయని గుర్తించినట్లు సంస్థ అధ్యక్షుడు అవినాష్ తెలిపారు. మృతి చెందిన వాటిలో చిరుత, ఎలుగుబంట్లు, జింకలు 20కిపైగా ఉండగా, మిగిలినవి చిన్న చిన్న జంతువులని ఆయన తెలిపారు. మహారాష్ట్రలో నిర్మాణమయ్యే జాతీయ రహదారులపై ఏయే ప్రాంతాల్లో అండర్‌పాస్ వంతెనలు అవసరమనేది నివేదించినట్లు ఆయన తెలిపారు.

**నాలుగు చోట్ల..**

మహారాష్ట్ర భీవండి నుంచి నిర్మల్ మీదుగా జగిత్యాల వరకు 758 కి.మీ దూరం జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తెలంగాణలో 57 కి.మీ దూరం పొడవునా, నిర్మల్, ఖానాపూర్, మల్లపురం, రాయికల్, జగిత్యాల వరకు జరిగే జాతీయ రహదారి పనుల్లో ఖానాపూర్ సమీపంలో అటవీ ప్రాంతం నుంచి వెళుతుంది. గతంలో ఉన్న రోడ్డు దాటే సమయంలో వన్యప్రాణులకు హాని కలగడం, రోడ్డు దాటే జంతువుల కారణంగా కొద్ది దూరంలో ఆగి వేచిచూడటం, కొన్ని సార్లు జంతువుల దాడికి గురైన సందర్భాలు ఉన్నాయి. జంతువుల సంరక్షణను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం అటవీశాఖ అధికారుల ప్రతిపాదనల మేరకు వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా, పైనుంచి వాహనాలు, కింది నుంచి జంతువులు వెళ్లేందుకు వీలుగా రూ.42 కోట్ల వ్యయంతో నాలుగు ప్రాంతాల్లో అండర్ పాస్ వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండు చోట్ల కి.మీ పొడవునా, మరో రెండు చోట్ల తక్కువ దూరంతో బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోంది.

# అడవుల జిల్లా ఆకాంక్ష.. విశ్వవిద్యాలయం

నిర్మల్ : అభివృద్ధిలో అట్టడుగున ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇతర ప్రాంతాలతో పోలిస్తే అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉంది. ముఖ్యంగా చదువుల తల్లి సరస్వతీదేవి కొలువైన ఈ ప్రాంతంలో ఉన్నత విద్యావకాశాలు లేకుండా పోతున్నాయి. ఈ ప్రాంతంలో విశ్వవిద్యాలయ ఏర్పాటు ఇప్పటికీ తీరని కలగా మారింది. ఎప్పటికప్పుడు పాలకులు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని ప్రకటిస్తున్నా ఆచరణలో విఫలమవుతున్నారు.

**నీరుగారుతున్న లక్ష్యం**

ప్రతీ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని 2007లో నేషనల్ నాలెడ్జ్ కమిషన్ సూచించింది. ఈ మేరకు శ్రీ జ్ఞానసరస్వతి విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ నిర్ణయం తీసుకున్నారు. కానీ రాజకీయ పరిణామాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అప్పటి నుంచి యూనివర్సిటీ ఏర్పాటుకోసం ఉద్యమాలు సాగుతూనే ఉన్నాయి. విశ్వవిద్యాలయ సాధనసమితి ఆధ్వర్యంలో కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ, పలువురు ముఖ్యమంత్రులతో పాటు ఉన్నత విద్యామండలికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండాపోయింది.

**ప్రణాళిక దశలో నిలిచిన సీఎం హామీ**

గత ప్రభుత్వం జిల్లాలో విశ్వవిద్యాలయ ఏర్పాటును విస్మరించింది. కాంగ్రెస్ కొత్తగా అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు జిల్లా పర్యటనకు వచ్చినపుడు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. తర్వాత ఉన్నత విద్యాశాఖ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖమ్మం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో కొత్తగూడెంలో మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చేందుకు నివేదిక రూపొందించాలని ప్రభుత్వం తాజాగా ఉన్నత విద్యామండలికి ఆదేశాలు జారీచేసింది. అదే సమయంలో ఆదిలాబాద్ విషయం మాత్రం పక్కన పెట్టేశారు. దీంతో ఉమ్మడి జిల్లా వాసులు తీవ్రంగా కలత చెందుతున్నారు.

**ఈ సమావేశాలే కీలకం**1991లో నిర్మల్ పట్టణంలో ప్రారంభమైన కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలను ఉన్నతీకరించేందుకు గతంలోనే ప్రతిపాదించి, అనుమతించి, నిధులు మంజూరు చేసినా స్థానిక నేతల వైఫల్యంతో కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో సానుకూల ప్రకటనలు చేసిన తరుణంలో నిర్మల్ కళాశాలను ఉన్నతీకరణకు అవకాశాలు సుగమమయ్యాయి. దీనికోసం ప్రస్తుతం జరగబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో తగిన నిధులు కేటాయించడం కీలకంగా మారనుంది. ప్రభుత్వం చొరవచూపి బడ్జెట్ కేటాయిస్తే శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయంగా ఉన్నతీకరణ జరుగుతుంది. ఇక్కడ సాధ్యం కాని పక్షంలో ఉమ్మడి జిల్లాలో ఇతర ప్రాంతంలోనైనా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు వచ్చే బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని, ఇది అత్యవసరమే కాదు జిల్లావాసులకు ఎంతో ఆవశ్యకమని శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయ సాధన సమితి అధ్యక్షుడు నంగె శ్రీనివాస్ పేర్కొన్నారు. **విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయొద్దు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, భాజపా శాసనసభాపక్షనేత, నిర్మల్**విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. ఉమ్మడి జిల్లాలో విద్యారంగ సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు అంతంతే. యూనివర్సిటీ ఏర్పాటు అందరి కల. గత పాలకులు విస్మరించారు. ఉట్నూరు కేంద్రంగా గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తామన్నా ఆచరణలోకి రాలేదు. నిర్మల్‌లోని యూనివర్సిటీ పీజీ కళాశాల ఉన్నతీకరణ నిలిచిపోయింది. ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క సొంత జిల్లాకే ప్రాధాన్యమిస్తు న్నారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సహకరించాలి. **నిధులు కేటాయించాలి అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన జిల్లాను నిర్లక్ష్యం చేయడం సరికాదు.




# పీవోకేలో భారత్ ఆపరేషన్ సక్సెస్

## మా పోరాటం ఉగ్రవాదులపైనే.. పాక్ నష్టానికి బాధ్యత వారిదే: రక్షణశాఖ

'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా మే 7న జరిపిన దాడుల్లో ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు రక్షణశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఉగ్రవాదం, ఉగ్రవాదులపైనే తమ పోరు అని 'ఆపరేషన్ సిందూర్'పై నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను అధికారులు ప్రదర్శించారు. పాకిస్థాన్ సేనలు ఉగ్రవాదులకు అండగా నిలిచాయని, ఈ పోరాటాన్ని తమ పోరాటంగా మలచుకున్నాయని పేర్కొన్నారు. దీంతో భారత సైన్యం దీటుగా జవాబు ఇచ్చిందని చెప్పారు. పాకిస్థాన్ సైన్యానికి ఏదైనా నష్టం వాటిల్లితే దానికి వారే బాధ్యులని స్పష్టం చేశారు. పాకిస్థాన్ దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయని, దాయాది ఆటలు సాగనివ్వలేదన్నారు. అనంతరం పాక్‌లోని నూర్‌ఖాన్, రహీమ్‌యార్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను ప్రదర్శించారు.

**పీవోకేలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతం: ఏకే భారతి...** "పాకిస్థాన్, పీవోకేలో ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేశాం. పీవోకేలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైంది. ఉగ్రవాదుల శిబిరాలే లక్ష్యంగా మనం యుద్ధం చేశాం. అత్యాధునిక క్షిపణి రక్షక వ్యవస్థలతో పాక్ క్షిపణులు, డ్రోన్‌లను తిప్పికొట్టాం. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశాం. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆకాశ్‌ను ఈ ఆపరేషన్‌లో సమర్థంగా వినియోగించాం. పాకిస్థాన్‌కు చెందిన సామాన్య పౌరులకూ ఎలాంటి నష్టం చేయలేదు. అదే సమయంలో పాకిస్థాన్ వైపు నుంచి దాడులను సమర్థంగా తిప్పికొట్టాం. చైనా తయారు చేసిన పీఎల్-15 క్షిపణిని నేలకూల్చాం. పాకిస్థాన్‌కు చెందిన అనేక డ్రోన్లు, మిస్సైళ్లను కూల్చివేశాం. ఉగ్రవాదంపై పోరాటంలో పాక్ సైన్యం జోక్యం చేసుకుంటే తిప్పికొట్టాం. కరాచీ సమీపంలోని లక్ష్యాలపైనా దాడులు చేశాం" అని ఎయిర్ మార్షల్ ఏకే భారతి వెల్లడించారు.

**పటిష్ఠ నిఘాతో దాడులను తిప్పికొట్టాం.. వైస్ అడ్మిరల్ ప్రమోద్...** భారత్ వైపు గగనతల దాడులను తక్షణమే పసిగట్టి నిలువరించామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు.

ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్లు, రాడార్లు ఉపయోగించామన్నారు. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించామని చెప్పారు. డ్రోన్లు, హైస్పీడ్ మిస్సైళ్లను వినియోగించినట్లు వెల్లడించారు. నౌకాదళ అడ్వాన్స్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించగలిగినట్లు పేర్కొన్నారు. "వందల కి.మీ దూరంలో ఉన్న శత్రుసేనల విమానాలను దగ్గరకు రాకుండా అడ్డుకున్నాం. త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి. మన స్వదేశీ ప్రతిస్పందన దాడి వ్యవస్థ చాలా బలమైంది. సైన్యానికి అండగా నిలిచిన 140 కోట్ల మంది ప్రజలకు ధన్యవాదాలు. ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టేందుకు సైన్యం సర్వసన్నద్ధంగా ఉంది" అని వైస్ అడ్మిరల్ ప్రమోద్ స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా ఉగ్రవాదం తీరులో మార్పు వచ్చిందని.. ఉగ్రవాదులు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆర్మీ డీజీఎంవో రాజీవ్ ఘాయ్ అన్నారు.

## విరాట్ కోహ్లీ.. లక్షల మందికి స్ఫూర్తి: రిటైర్మెంట్‌పై తెలుగు రాష్ట్రాల సీఎంల స్పందన



హైదరాబాద్: టెస్టు క్రికెట్‌కు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వీడ్కోలు పలకడంపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి స్పందించారు. ఆయన నాయకత్వ లక్షణాలు లక్షల మందికి స్ఫూర్తినిచ్చాయని కొనియాడారు. మిగతా ఫార్మాట్లలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**అద్భుత అధ్యాయం ముగిసింది: చంద్రబాబు...** టెస్టు క్రికెట్ నుంచి విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌తో భారత క్రీడా చరిత్రలో ఓ అద్భుత అధ్యాయం ముగిసిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. క్రికెట్‌లో అతడి అభిరుచి, క్రమశిక్షణ చాలా మందిలో స్ఫూర్తిని నింపాయన్నారు. విరాట్ కోహ్లీ దేశానికే గర్వకారణమని, అతడి తదుపరి ప్రయాణం.. విజయపథంలో సాగాలని ఆకాంక్షించారు.

**విరాట్ పేరు చరిత్రలో నిలిచిపోతుంది: రేవంత్ రెడ్డి...** భారత క్రికెట్ చరిత్రలో 'విరాట్ కోహ్లీ' ఒక గొప్ప పేరుగా నిలిచిపోతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అద్భుతమైన క్రీడా వారసత్వాన్ని కొనసాగించాడని ప్రశంసించారు. అనేక రికార్డులు సృష్టించి, అత్యంత క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్నాడని, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడారు.

టెస్టు క్రికెట్ నుంచి వైదొలగుతున్నందున.. మిగతా ఫార్మాట్లలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.


## మద్యం కుంభకోణం.. నిందితులను కఠినంగా శిక్షించాల్సిందే: మంత్రి సత్యకుమార్ యాదవ్




విజయవాడ: మద్యం కుంభకోణం ద్వారా ప్రపంచం విస్తుపోయేలా వైకాపా నేతలు అవినీతికి పాల్పడ్డారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. ముఖ్యమంత్రే స్వయంగా డిస్టిలరీలు పెట్టడం, సొంత బ్రాండ్లు తయారు చేయించడం లాంటి విడ్డూరం ప్రపంచంలో ఎక్కడా చూడలేదన్నారు. మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సదస్సులో సత్యకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2014-19 మధ్య కాలంలో 49 వేల కిడ్నీ కేసులు నమోదైతే... 2019-2024 మధ్య 91 వేలకు పెరిగాయన్నారు. కాలేయ సమస్యలకు సంబంధించిన కేసులు సైతం భారీగా పెరిగినట్లు సత్యకుమార్ తెలిపారు. న్యూరో సంబంధిత కేసులు 380 నుంచి 7,800కి పెరిగినట్లు చెప్పారు. గత ప్రభుత్వ నేతలు నాణ్యతలేని మద్యం తయారు చేయించి లక్షల మంది ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇది క్షమించరాని నేరమని, బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిన అవసరముందన్నారు.

# ఇరిగేషన్ పనుల్లో జాప్యం చేయొద్దు

విజయవాడ:ఇరిగేషన్ పనులు, నిర్వహణ, మరమ్మత్తుల కోసం రూ. 344 కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అవసరమైన చోట్ల 7 రోజుల వ్యవధితో షార్ట్ టెండర్లను పిలవడానికి ప్రభుత్వం అనుమతిచ్చిందని అన్నారు. ఇవాళ(సోమవారం) ఓ అండ్ ఎం పనులపై ఇరిగేషన్ అధికారులతో, మంత్రి నిమ్మల రామానాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్, కడా కమిషనర్ రాంసుందర్ రెడ్డి, ఈఎన్సీ వెంకటేశ్వరావు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీఈలు, ఎస్ఈలు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతు పనులను చేపట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. 2025 ఖరీఫ్ ప్రారంభానికి ముందు నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్థితికి తీసుకురావాలని ఆదేశించారు. గేట్లు, షట్టర్లు, వంటి మెకానికల్ పనులను తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజనీర్ పరిశీలించి, సక్రమంగా పనిచేసే స్థితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని, చీఫ్ ఇంజనీర్‌కు ఇవ్వాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సాగు నీటి సంఘాలు ఆధ్వర్యంలో, వారి పరిధిలోని పనులను, మే



నెలాఖరుకు పూర్తిచేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. పనులను సకాలంలో పూర్తిచేయడానికి చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు నిరంతరంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని పనులూ, సీజన్ మొదలయ్యే నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గతంలో మాదిరిగా కాకుండా మే చివరి నాటికి, అన్ని అత్యవసర పనులు, నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు నిర్దేశించారు.

# విద్యుత్ చార్జీలపై మంత్రి గొట్టిపాటి కీలక ప్రకటన

ప్రకాశం: విద్యుత్ చార్జీలు పెంచలేదు, పెంచబోమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని తెలిపారు. యాక్సిస్ గ్రూప్ ఫీల్డ్ ఎనర్జీ మీద వైసీపీ నేతలు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం మీద వైసీపీ నేతలు పదే పదే బురదజల్లే పనులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ(సోమవారం) ప్రకాశం జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పులు సరిదిద్దడానికే తమకు టైం సరిపోతుందని చెప్పారు. విద్యుత్ శాఖను జగన్ దుర్వినియోగం చేశారని ఆరోపించారు. యాక్సిస్ ఎనర్జీకి రూ.5.12లకు జగన్మోహన్ రెడ్డి ఒప్పందం చేసుకున్నారని... తమ ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకుని రూ. 4.60లకు పీక్ అవర్స్‌లో కూడా విద్యుత్ సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్నామని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వం విద్యుత్ శాఖను తమ ఆదాయ వనరుగా మార్చుకుందని విమర్శలు చేశారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాయలసీమ, ప్రకాశం జిల్లా ప్రాంతాల్లో రెన్యువబుల్ ఎనర్జీకి పెద్దపీట వేశామని ఉద్ఘాటించారు. రెన్యువబుల్ ఎనర్జీలో దేశంలో రాయలసీమ ప్రాంతం అనుకూలమని చెప్పారు. తప్పుచేసిన వారికి రెడ్‌బుక్ వర్తిస్తుందని హెచ్చరించారు. అవసరం లేకుండా ఈ ప్రభుత్వం ఎవరిని ఇబ్బంది పెట్టదని స్పష్టం చేశారు. గతంలో తప్పులు చేసిన వారికే రెడ్‌బుక్ వర్తిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు.



## నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మంగళగిరి: వైద్యరంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో.. రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివన్నారు. నర్సుల చేతి స్పర్శ కూడా రోగిలో మానసిక స్థైర్యంతో పాటు సాంత్వన కలిగిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులతో ఆయన సమావేశం అయ్యారు. ఉత్తమ సేవలు అందించిన ఎనిమిది మందిని సత్కరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరచిపోరు. మీరు పడే శ్రమ, కష్టం నాకు తెలుసు. కొవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించిన విధానం మరువలేం. ఇటీవల సింగపూర్‌లో నా కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో ఉన్న సమయంలో అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరోసారి మీ కష్టం గుర్తుకు వచ్చింది. మిమ్మల్ని కలసి మీరు అందించే సేవలు మరచిపోలేనివి అని చెప్పి కృతజ్ఞతలు చెప్పాలనుకున్నాను. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలిసే అవకాశం రావడం ఆనందాన్నిచ్చింది. నా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్తాం" అని తెలిపారు.



# పోలీసుల విచారణకు హాజరైన తోపుదుర్తి

సీకేపల్లి: వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి శ్రీసత్యసాయి జిల్లా సీకేపల్లి పీఎస్‌లో పోలీసుల విచారణకు హాజరయ్యారు. మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా పాపిరెడ్డిపల్లెలో జరిగిన హెలికాప్టర్ ఘటన కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు. జగన్ పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్ద తోపులాట జరిగిన విషయం తెలిసిందే. ఆయన హెలికాప్టర్ దిగకముందే వైకాపా కార్యకర్తలు దూసుకొచ్చారు. ఈ ఘటనలో కొంతమంది ఆ పార్టీ కార్యకర్తలు రాళ్లదాడికి పాల్పడటంతో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. జగన్ భద్రతపై పోలీసులు చేసిన సూచనలను మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి పాటించలేదు. హెలిప్యాడ్ వద్ద కార్యకర్తలను తోపుదుర్తి రెచ్చగొట్టినట్లు.. భద్రతా వైఫల్యంగా చూపేందుకు యత్నించినట్లు పోలీసుల విచారణలో నిర్ధరణ అయింది. దీంతో ఆయనపై కేసు నమోదైంది.



# యుద్ధం అంటే.. బాలీవుడ్ సినిమా కాదు..!

పుణె: భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరుదేశాల మధ్య గత శనివారం కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అయితే, దీనిపై కొంత వ్యతిరేకత ఎదురవుతున్న వేళ భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణే కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం అంటే బాలీవుడ్ సినిమా కాదని, ఎన్నో కుటుంబాలు తమ ప్రియమైన వారిని కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. దౌత్యానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న నరవణె.. కాల్పుల విరమణ ఒప్పందంపై మాట్లాడారు. "యుద్ధం వల్ల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే పౌరుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. షెల్లింగ్‌ను చూడగానే చిన్న పిల్లలు సైతం రాత్రి పూట సురక్షిత ప్రాంతాలకే పరిగెత్తాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రియమైన వారిని కోల్పోతే ఆ ఆవేదన తరతరాలను వెంటాడుతుంది" అని ఆర్మీ మాజీ చీఫ్ తెలిపారు.

**పాక్ వెన్నువిరిచిన బ్రహ్మోస్.. దెబ్బకు దిగి వచ్చి కాల్పుల విరమణకు అంగీకారం...** "యుద్ధం అంత రొమాంటిక్‌గా ఉండదు. ఇదేం బాలీవుడ్ సినిమా కాదు. చాలా తీవ్రమైన అంశం. యుద్ధం అనేది మనం ఎంచుకునే చివరి అవకాశంగా ఉండాలి. అందుకే ప్రధాని మోదీ ఇది యుద్ధాల శకం కాదని చెప్పారు. తెలివితక్కువ వాళ్ల వల్ల బలవంతంగా యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా.. దాన్ని నివారించేందుకే మనం మొగ్గు చూపాలి. ఇప్పుడు చాలామంది పూర్తిస్థాయి యుద్ధానికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నిస్తున్నారు. సైన్యంలో పనిచేసిన వ్యక్తిగా.. యుద్ధానికి వెళ్లేందుకు నేను సిద్ధమే. కానీ, దౌత్యాన్ని తొలి అవకాశంగా ఎంచుకుంటా. చర్చలతోనే సమస్య పరిష్కారం కావాలని కోరుకుంటా" అని నరవణే వ్యాఖ్యానించారు.



# చల్లారిన ఉద్రిక్తతలు.. ఎయిర్‌పోర్ట్‌లు రీఓపెన్

దిల్లీ: భారత్-పాక్ నడుమ ఉద్రిక్తతల నేపథ్యంలో ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను మే 15 వరకు మూసివేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తొలగిపోవడంతో విమానాశ్రయాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. తొలుత ఈనెల 15 వరకు వాటిని మూసివేయాలని భావించినప్పటికీ పరిస్థితులు మెరుగుపడటంతో వాటిని తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. పౌర విమానయాన కార్యకలాపాలు వెంటనే అందుబాటులోకి వస్తాయని.. ఈవిషయాన్ని దృష్టిలోఉంచుకొని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

విమానాల సేవలు, వివరాలకు సంబంధించిన ఇతర విషయాలు తెలుసుకోవడానికి ప్రయాణికులు ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్‌లను పర్యవేక్షించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సూచించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ పాక్‌లోని వివిధ ఉగ్రస్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు చేయడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో సరిహద్దులకు దగ్గరగా ఉన్న దాడులు జరిగేందుకు అవకాశమున్న చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, లూథియానా, భుంటార్, కిషన్‌గఢ్, పటియాలా, శిమ్లా, ధర్మశాల, భఠిండా, జైసల్మేర్, జోధ్‌పుర్, లేహ్, బికనేర్, పఠాన్‌కోట్, జమ్మూ, జామ్‌నగర్, రాజ్‌కోట్, భుజ్ తదితర విమానాశ్రయాలను మూసివేస్తున్నట్లు పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. ఇటీవల ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడంతో సరిహద్దు ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో ఈ సేవలను తిరిగి పునరుద్ధరించింది.

# అనసూయ.. నడముతో వయ్యారాల సెగ

అనసూయ భరద్వాజ్.. ఎలాంటి డ్రెస్ లో కనిపించినా కూడా తనదైన గ్లామర్ తో సరికొత్తగా కనిపిస్తూ ఉంటుంది. ఇటీవల షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో నాన్ స్టాప్ గా వైరల్ అవుతున్నాయి. పింక్ కలర్, మల్టీ కలర్ లెహంగా–చోళీ ధరించి అనసూయ చేసిన ఈ ఫొటో షూట్ ఫ్యాన్స్‌ని పూర్తిగా ఆకట్టుకుంటోంది. బోల్డ్ అటిట్యూడ్, క్యూట్ ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ అంతా కలసి ఈ ఫొటోలు స్పెషల్ గా నిలుస్తున్నాయి. రంగురంగుల దుస్తులు, పర్ఫెక్ట్ స్టైలింగ్ తో అనసూయ ఈ సారి మరీ అందంగా కనిపిస్తోంది. ఈ ఫోటోల్లో అనసూయ వేసిన మల్టీ కలర్ లెహంగా దుస్తులు అద్భుతంగా ఆకర్షిస్తున్నాయి. పైన వేసిన చోళీ పైన చిన్న చిన్న అద్దాలు, కట్లు వేస్తూ డిజైన్ చేసిన పద్ధతి, చీరని ఎగుర వేసిన ఫోటో పాజ్ అంతా చూసేవారికి ఒక కళాత్మక దృశ్యం లా కనిపిస్తోంది. ఈ లుక్‌లో అనసూయ స్టైల్, కాన్ఫిడెన్స్ రెండూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ ఫోటోలు చూసి కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. 'అనసూయ గారూ..



మీరు వెన్నెలకంటే అందంగా ఉన్నారు', 'ఒక్క చూపుతో గుండెల్లో తుఫాను' అంటూ ఫ్యాన్స్ రియాక్షన్లు వెల్లువెత్తుతున్నాయి. అనసూయ ఈ మధ్యకాలంలో తన లుక్‌లతో, ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తో ఎక్కువగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. అనసూయ కెరీర్ విషయానికి వస్తే, యాంకరింగ్ నుంచి సినిమాల వరకు తనదైన గుర్తింపు తెచ్చుకుంది. 'జబర్దస్త్' షోతో స్టార్ యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అనసూయ, ఆ తర్వాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' వంటి బిగ్ స్క్రీన్ ప్రాజెక్ట్‌లలో తన నటనతో కితాబు అందుకుంది. పుష్ప సినిమాలోని దాక్షాయిణి పాత్ర అయితే ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. తాజాగా అనసూయ వెబ్ సిరీస్‌లలోనూ బిజీ అవుతోంది. అలాగే అనసూయ మరికొన్ని ప్రాజెక్ట్స్‌లో నటిస్తోంది. అలాగే ఒక నటిగా మాత్రమే కాకుండా యాంకర్, మోడల్, వెబ్ సిరీస్ ఆర్టిస్ట్ ఇలా విభిన్న వేదికల్లో తనదైన ముద్ర వేసుకుంటూ వెళ్తోంది.

# నటనారంగేట్రంపై సారా టెండూల్కర్ ట్విస్ట్

క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ బాలీవుడ్ ఆరంగేట్రం గురించి చాలా కాలంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. సినీ సెలబ్రిటీలతో అత్యంత సన్నిహితంగా వ్యవహరించే సారా టెండూల్కర్ కథానాయికగా ఆరంగేట్రం చేసేందుకు సిద్ధంగా ఉందని కథనాలొచ్చాయి. కానీ దీనిపై సచిన్ కుటుంబం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. తాజాగా వోగ్ ఇండియాతో ప్రత్యేక సంభాషణలో సారా టెండూల్కర్ స్వయంగా తన తెరంగేట్రం గురించి ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది. సారా తాజా ఇంటర్వ్యూలో తనను నటించాల్సిందిగా ఎవరైనా కోరితే దానిని తిరస్కరిస్తున్నానని సారా టెండూల్కర్ వెల్లడించింది. "నేను అంతర్ముఖురాలిని... కెమెరాలు నన్ను భయపెడుతున్నాయి" అని సారా వెల్లడించింది. ఆ వృత్తికి న్యాయం చేయలేనని భావిస్తున్నాను. నటన



నాకు సంతృప్తి కంటే ఎక్కువ ఆందోళనను ఇస్తుంది. అందుకే అవకాశాలు వచ్చినా తిరస్కరిస్తున్నాను.. అని తెలిపింది. తాను నటనలోకి రాలేనని సారా అధికారికంగా వెల్లడించింది. ఫ్యాషన్ షూట్‌లు, బ్రాండ్స్ ప్రచారాలలో దూకుడుగానే ఉన్న సారా నటనను కెరీర్ గా ఎంచుకునే ఆలోచనతో లేదని తన మాటల్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. తనకు ప్రజాదరణ, అసాధారణమైన బ్యాకింగ్ ఉన్నప్పటికీ తాను స్టార్‌డమ్‌ను ఆశించడం లేదని సారా స్పష్టంగా చెప్పింది. నేను ఫ్యాషన్, అందం, లైఫ్ స్టైల్ వంటి వృత్తులలో కూడా పని చేస్తాను. నేను ప్రామాణికమైనది అనిపించేటిని మాత్రమే తీసుకుంటాను.. ప్రతిదానికీ అవుననలేను! అని సారా అంది.

యూనివర్శిటీ ఆఫ్ కాలేజ్ లండన్ లో బయో మెడికల్ సైన్సెస్‌లో బ్యాచిలర్ అండ్ క్లినికల్ న్యూట్రిషన్, పబ్లిక్ హెల్త్‌లో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసిన సారా వైద్యవృత్తిలో కౌన్సిలింగ్ కెరీర్ పైనా దృష్టి సారించనుంది. ఇప్పుడు సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్‌లో డైరెక్టర్‌గా పనిచేస్తూ ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై తనవంతు సేవాకార్యక్రమాల్లోను పాల్గొంటోంది.




# ముగ్గురు యంగ్ హీరోల బ్రదర్ హుడ్.. 'భైరవం' ధం ధమారే..




టాలీవుడ్ యంగ్ హీరోలు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్.. కాంబినేషన్ లో మల్టీస్టారర్ మూవీ భైరవం ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఆ మూవీని శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్ పై కేకే రాధామోహన్ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. దివ్య పిళ్లై, అదితి శంకర్, ఆనంది హీరోయిన్లుగా నటిస్తుండగా.. ప్రియమణి, జయసుధ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముగ్గురు హీరోలు నటిస్తుండడంతో మూవీ ఎలా ఉంటుందోనని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. ఆ జోష్ తో మేకర్స్ మరో అప్డేట్ ఇచ్చారు. రీసెంట్ గా అనౌన్స్ చేసినట్లు ఆదివారం ఉదయం మూడో సింగిల్ ను రిలీజ్ చేశారు. అన్నదమ్ములు పండుగలా వస్తారంటూ దం దమారే సాంగ్ ను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ప్రస్తుతం ధం ధమారే సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మాస్ బీట్స్ తో ఉన్న పాట.. అందరినీ ఆకట్టుకుంటోంది. ఆలయంలో జరిగిన ఓ వేడుక సమయంలో మూవీలో ధం ధమారే సాంగ్ ఉండనున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. మనోజ్, రోహిత్, సాయి శ్రీనివాస్.. ముగ్గురూ తమ మాస్ స్టెప్పులతో అలరించారు. అయితే ధం ధమారే సాంగ్ కు భాస్కర భట్ల లిరిక్స్ అందించగా.. శ్రీ చరణ్ పాకాల కంపోజ్ చేశారు. ప్రముఖ సింగర్స్ రేవంత్, సాహితి, సౌజన్య ఆలపించారు.. సింపుల్ గా గాత్రంతో ప్రాణం పోశారని చెప్పాలి. మ్యూజిక్, లిరిక్స్, సింగింగ్.. అన్నీ బాగున్నాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సాంగ్ అదిరిపోయిందని చెబుతున్నారు.. అదే సమయంలో మూవీపై అంచనాలు పెరుగుతున్నాయని అంటున్నారు. అయితే మే 30వ తేదీన సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ రీసెంట్ గా ప్రకటించారు. సమ్మర్ కానుకగా థియేటర్స్ తో తీసుకువస్తున్నట్లు అనౌన్స్ చేశారు. మరి భైరవం మూవీతో నారా రోహిత్, మంచు మనోజ్, బెల్లంకొండ శ్రీనివాస్ ఎలాంటి సక్సెస్ అందుకుంటారో వేచి చూడాలి.

# యువన్ - ఇళయరాజా కాంబో.. ఈ పాట విన్నారా?




టాలీవుడ్ సీనియర్ నటీనటులు రాజేంద్ర ప్రసాద్, అర్చన చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత జోడీగా షష్టిపూర్తి మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. అదే సమయంలో ఆ చిత్రంలో యువ జంటగా రూపేష్, ఆకాంక్ష సింగ్ యాక్ట్ చేస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న షష్టిపూర్తి మూవీకి పవన్ ప్రభ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయి ప్రొడక్షన్స్ బ్యానర్ పై రూపేష్ నిర్మిస్తున్న ఆ మూవీకి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీత దర్శకుడిగా వర్క్ చేస్తున్నారు. అదే సమయంలో ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న మూవీ రిలీజ్ కు సిద్ధమవుతోంది. మే 30వ తేదీన సినిమాను థియేటర్స్ లో విడుదల చేయనున్నారు మేకర్స్. ప్రమోషన్స్ కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మూవీపై ఆడియన్స్ లో పాజిటివ్ బజ్ క్రియేట్ అవ్వగా.. వరుసగా అప్డేట్స్ తో సందడి చేస్తున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన సాంగ్స్ తో మంచి అంచనాలు నెలకొల్పారు. తాజాగా మరో సాంగ్ రాత్రంతా రచ్చే పాట ప్రోమోను రిలీజ్ చేశారు. అందులో రూపేష్, ఆకాంక్ష సింగ్ ఇద్దరూ రొమాంటిక్ స్టెప్పులతో మెప్పించారు. అయితే ఆ సాంగ్ కోసం లెజండరీ స్వరకర్త ఇళయరాజా, యువన్ శంకర్ రాజా వర్క్ చేయడం విశేషం. తెలుగులో మొట్టమొదటిసారిగా యువన్ తన తండ్రి స్వరపరిచిన పాటకు తన స్వరాన్ని అందించారు. ఆయనతోపాటు నిత్యశ్రీ గాత్రం కలిపారు. దీంతో టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మెమోరబుల్ సాంగ్ గా రాత్రంతా రచ్చే సాంగ్ నిలిచింది. షష్టిపూర్తి మూవీకి గాను ఈడో ఎడెడు పాట కోసం ఇళయరాజా, ఆస్కార్ విజేత ఎం ఎం కీరవాణి కలిసి వర్క్ చేశారు. ఇళయరాజా మ్యూజిక్ అందించగా, కీరవాణి సాహిత్యం అందించారు. ఇప్పటికే ఆ విషయం వార్తల్లో నిలిచింది. ఇప్పుడు ఇళయరాజా, యువన్ కాంబినేషన్ సినిమా సంగీత ఆకర్షణను మరింత పెంచుతుంది. అలా సినిమాకు సాంగ్స్ తో ఆడియన్స్ లో మంచి బచ్ నెలకొంది. టీజర్ కూడా సూపర్ రెస్పాన్స్ సంపాదించుకుంది. అవుట్ పుట్ అద్భుతంగా వచ్చిందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. సమ్మర్ కు మంచి ఫీల్ గుడ్ మూవీతో వీడ్కోలు టాలీవుడ్ చెప్పనున్నట్లు తెలుస్తోంది. ట్రైలర్ ను త్వరలో రిలీజ్ చేయనున్నారు. మరి షష్టిపూర్తి సినిమా ఎలా ఉంటుందో.. ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# హిట్ పడినా పట్టించుకోరేం..?

సినీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నప్పటికీ సొంత టాలెంట్‌తోనే ఎదిగింది ఐశ్వర్య రాజేష్. తెలుగమ్మాయి కావడం, కలర్ తక్కువ ఉండటంతో కెరీర్ ఆరంభంలో చాలా స్ట్రగుల్స్ ఫేస్ చేసింది. సొంత ఇండస్ట్రీలో అవకాశాలు రాక కోలీవుడ్ బాట పట్టింది. గ్లామర్ షో కన్నా నటనకు ప్రయారిటీ ఉన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ తమిళనాట స్టార్ హీరోయిన్ గా ముద్ర వేయించుకుంది. అక్కడ సంపాదించుకున్న క్రేజ్ తోనే తెలుగు, మలయాళం భాషల్లోనూ అవకాశాలు అందిపుచ్చుకుంది. తెలుగులో ఐశ్వర్య తొలి చిత్రం ' కౌసల్య కృష్ణమూర్తి '. క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగులో ' మిస్ మ్యాచ్ ', ' వరల్డ్ ఫేమస్ లవర్ ', ' టక్ జగదీష్ ', ' రిపబ్లిక్ ' వంటి సినిమాల్లో ఐశ్వర్య నటించింది. కానీ ఆయా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టడంతో ఐశ్వర్య రాజేష్ మళ్లీ పొరుగు భాషా చిత్రాలపైనే ఆధాపడింది. తమిళ్, మలయాళ భాషల్లో సినిమాలే కాకుండా ట్రెండ్ కు తగ్గట్లుగా వెబ్ సిరీస్‌లలో యాక్ట్ చేస్తూ దూసుకుపోతుంది. అలాంటి తరుణంలోనే టాలీవుడ్ నుంచి ఐశ్వర్యకు పిలుపొచ్చింది. విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబో మూవీ ' సంక్రాంతి వస్తున్నాం 'లో వన్ ఆఫ్ ది హీరోయిన్ గా చేసే అవకాశాన్ని అందుకుంది. 2025 సంక్రాంతి



కానుకగా విడుదలైన ఈ సినిమా ఎంతటి భారీ విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వరల్డ్ వైడ్ గా 300 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించి వెంకటేష్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డు సృష్టించింది. అటు పండుగ సమయంలో విడుదలై, సంక్రాంతి విన్నర్ గానూ నిలిచింది. ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ లో వెంకీ భార్యగా భాగ్యం పాత్రలో ఐశ్వర్య అదరగొట్టేసింది. ఆమె ఎనర్జిటిక్ యాక్టింగ్, డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంక్రాంతి వస్తున్నాం మూవీతో తెలుగులో ఐశ్వర్య ఓ బిగ్ హిట్ ను అందుకుంది. అయినప్పటికీ టాలీవుడ్ ఆమెను పట్టించుకోవడం లేదన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం ఐశ్వర్య రాజేష్ చేతిలో దాదాపు అర డజన్ కొత్త ప్రాజెక్ట్స్ ఉన్నాయి. కానీ, అందులో ఒక్క తెలుగు సినిమా కూడా లేకపోవడం గమనార్హం. కథల ఎంపికలో సెలక్టివ్ గా ఉండే ఐశ్వర్యకు టాలీవుడ్ లో అవకాశాలు రావడం లేదా? లేక వచ్చిన ఆఫర్లు నచ్చడం లేదా? అన్నది తెలియాల్సి ఉంది.

# నేనెప్పుడూ అలా అనుకోలేదు.. లైఫ్ లో ఇక చేయను!: సామ్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో వచ్చిన పుష్ప మూవీ ఎలాంటి విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. నార్త్ టు సౌత్ ఓ రేంజ్ లో వసూళ్లను రాబట్టింది. బన్నీ కెరీర్ గ్రాఫ్ నే మార్చేసింది. అయితే సినిమాలోని స్టార్ హీరోయిన్ సమంత చేసిన సాంగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఊ అంటావా మావా.. ఊఊ అంటావా మావా అంటూ సామ్ చేసిన సాంగ్.. వేరే లెవెల్ లో హిట్ అయింది. ఇప్పటికీ ఆ సాంగ్ ఎవర్ గ్రీనే అని చెప్పాలి. అనేక చోట్ల ఆ పాట వినిపిస్తూనే ఉంటోంది. అంతలా ఊ అంటావా ఊఊ అంటావా సాంగ్ మెప్పించింది. ముఖ్యంగా సామ్ వేసిన స్టెప్పులు, ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ నెవ్వర్ బిఫోర్. సోషల్ మీడియాలో ఆ సాంగ్ భారీ వ్యూస్ రాబట్టింది. అయితే సామ్ ఐటెమ్ సాంగ్ చేస్తుందనే ప్రకటన రాగానే.. ఓ రేంజ్ లో హైప్ క్రియేట్ అయ్యింది. ఆ తర్వాత సాంగ్ వచ్చాక అంతకుమించి హిట్ అయ్యింది. అదే సమయంలో సమంత ఐటెమ్ సాంగ్ చేయడం పట్ల కొందరు సినీ



ప్రియులు పెదవి విరిచారు. మరికొందరు మెచ్చుకున్నారు. ఇప్పుడు ఆ సాంగ్ పై ఓ ఇంటర్వ్యూలో భాగంగా మాట్లాడారు సమంత. ఊ అంటావా ఊఊ అంటావా సాంగ్ చేసే ఆఫర్ వచ్చినప్పుడు చాలామంది చేయొద్దని తనతో చెప్పారని తెలిపారు. అయితే తానెప్పుడూ ఒక హాలిట్ గర్ల్ గా అనుకోలేదని చెప్పారు. ఆ విధంగా తానెప్పుడూ అస్సలు ఊహించుకోలేదని సమంత పేర్కొన్నారు. కానీ ఆ సాంగ్ ఆఫర్ వచ్చినప్పుడు ఒక సవాలుగా తీసుకున్నానని, అలాగే పని చేశానని తెలిపారు సామ్. అయితే సెట్స్ లో అడుగు పెట్టినప్పుడు చాలా కంగారుపడ్డానని వెల్లడించారు. కానీ ధైర్యంగా సాంగ్ ను కంప్లీట్ చేసినట్లు తెలిపారు. మళ్లీ భవిష్యత్తులో అలాంటి పాటల్లో యాక్ట్ చేస్తాననుకోవడం లేదుని క్లారిటీ ఇచ్చారు. ఇక సాంగ్ విషయానికొస్తే.. ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్ లిరిక్స్ అందించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించగా.. మంగ్లీ సిస్టర్, సింగర్ ఇంద్రావతి తన హస్కీ వాయిస్ తో ఆలపించారు. ఇప్పటి వరకు యూట్యూబ్ లో ఊ అంటావా.. ఊఊ అంటావా సాంగ్.. 47 కోట్లకు పైగా వ్యూస్ అందుకుని ఇంకా దూసుకుపోతుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు!




న్యూఢిల్లీ: దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఢిల్లీలో ఏర్పాటు చేయనున్నారు. పీవీ విగ్రహ ఏర్పాటు ప్రతిపాదనకు ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ కీలక ఆమోదం తెలిపింది. ఇక కేంద్రం నిర్ణయమే తరువాయిగా మారింది. తెలంగాణ భవన్‌లో పీవీ విగ్రహం ఏర్పాటుకు న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదన చేసింది. ఇటీవల జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ ఆమోదం తెలిపింది. ఎన్డీఎంసీ ప్రతిపాదన మేరకు తెలంగాణ భవన్‌లోని విగ్రహ ఏర్పాటు ప్రతిపాదిత స్థలంలో తగు ఏర్పాట్లకు ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ పలు సూచనలు చేసింది. ఢిల్లీలో నూతన తెలంగాణ భవన్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రస్తుతం తెలంగాణ భవన్ ఆంధ్ర భవన్‌తో కలిసి ఉన్నందున ఇక్కడ ఏర్పాటు సాధ్యం కాదని తెలంగాణ భవన్ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్ర భవన్‌లో ఉన్న ఏపీ మాజీ ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు విగ్రహానికి సమీపంలో పీవీ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎన్‌డిఎంసినీ పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ కోరింది. ప్రతిపాదనను ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ పంపించడంతో కమిషన్ ఆమోదం తెలిపింది. ఢిల్లీలో పీవీ స్మారకం ఏర్పాటుతో పాటు ఆయనకు ఎన్డీఏ ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించింది. పీవీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేటప్పుడు ముఖ్యమైన ప్రముఖులు ప్రధాని మోదీ, లేదా ఇతర ప్రముఖులు ఈ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పీవీని కాంగ్రెస్ నేతలు అవమానించారు. పీవీ విగ్రాహాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూడా పెట్టనివ్వలేదు. పీవీ అంత్యక్రియలు కూడా ఢిల్లీలో జరగకుండా హైదరాబాద్‌లో జరిగాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం పీవీకి మర్యాద ఇచ్చింది. భారతరత్న ఇచ్చి గౌరవించింది. ఇప్పుడు ఢిల్లీలో పీవీకి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత కూడా ఎన్డీయేకే దక్కుతుంది.




## ఆపరేషన్ సిందూర్ ముగియలేదు.. పాకిస్తాన్‌కు వార్నింగ్..

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. పాక్ ఆక్రమిత కాశ్మీర్, పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను టార్గెట్ చేసి భారత ఆర్మీ దాడులకు పాల్పడింది. దాదాపు 100 మంది ఉగ్ర కుక్కలను చంపేసింది. ఈ నేపథ్యంలోనే రెండు దేశాల మధ్య యుద్ధం మొదలైంది. తీవ్రంగా నష్టపోయిన పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకుంది.

అయితే, కుక్క తోక వంకర అన్నట్లు పాక్ తన బుద్ధి మార్చుకోవటం లేదు. కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న రోజే పాక్ ఆర్మీ సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడింది. ఒప్పందానికి తూట్లు పొడుస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో నిన్న ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ కీలక ప్రకటన చేసింది. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని ప్రకటించింది. ఇక, పాక్ కాల్పుల విరమణకు తూట్లు పొడవటంపై భారత్ తీవ్ర హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐ రిపోర్టు ప్రకారం.. ' మే 10వ తేదీన పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించింది. అయినా కూడా డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడులు చేసింది. ఒప్పందాన్ని అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వాళ్లకు తెలియాలి. ఆపరేషన్ సిందూర్ మిగియలేదు.. కొనసాగుతూనే ఉంటుంది. ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు ఓ గట్టి సందేశం పంపాము. ఉగ్రవాదులకు గానీ, ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే వారికి గానీ పాకిస్తాన్‌లో సురక్షిత ప్రదేశం అంటూ ఏదీ లేదు. ఒక ప్రదేశంలో ఉగ్రవాదులకు ట్రైనింగ్ ఇచ్చి.. మరో చోటు నుంచి దాడికి సిద్ధం చేస్తారు. దాడి తర్వాత వెనక్కు వెళ్లిపోయి నాలుగు అంతస్తుల భవనంలో దాక్కుంటారు. మేము చాలా సురక్షితంగా ఉన్నాం అని వారు భావిస్తారు. మేము వాళ్ల కోస వస్తాం ' అని విశ్వసనీయ వర్గాలు పాక్‌కు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది.




హైదరాబాద్: తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. టీజీఐఐసీలో 1.75 లక్షల ఎకరాలను కేసీఆర్ అందుబాటులో ఉంచారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ భూమిని కుదువపెట్టాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ రహస్య జీవో ఇచ్చారని ఆరోపించారు. అన్ని భూములను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుదువపెట్టేలా జీవో తీసుకొచ్చారన్నారు. మరోవైపు కంచ గచ్చిబౌలి భూములను కుదువ పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. "టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారిస్తే ఎందుకు దాచారో సీఎం జవాబివ్వాలి. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టాక 1.75 లక్షల ఎకరాలకు ఎవరిది బాధ్యత? నిపుణుల సిఫార్సు లేకుండా చేస్తే జీవోను ఉపసంహరించుకోవాలి. భూములు కుదువ పెట్టి.. వచ్చిన డబ్బు పక్కదారి పట్టించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.1.80 లక్షల కోట్ల అప్పులు చేసింది. రూ.80 వేల కోట్లు మాత్రమే అప్పులు, వడ్డీల కోసం చెల్లించారు. మిగిలిన రూ.లక్ష కోట్లు ఎక్కడికి పోయాయి? ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

**పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం..** నేను పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నా. 47 నియోజకవర్గాల్లో పర్యటనలో వచ్చిన అభిప్రాయాలే చెబుతున్నా. పార్టీపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.. అది సరికాదు. సమయం వస్తే అన్నీ బయటకు వస్తాయి. నన్ను రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తాను. నాపై దుష్ప్రచారం విషయంలో పార్టీ స్పందిస్తుందని భావిస్తున్నా" అని కవిత తెలిపారు.




## అవును.. మా యుద్ధవిమానం ధ్వంసమైంది: అంగీకరించిన పాకిస్థాన్

ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించామని, ఆ దేశ అత్యాధునిక యుద్ధ విమానాలను నేలకూల్చామని భారత సైన్యం వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా పాకిస్థాన్ ఆర్మీ స్పందించింది. తమ ఫైటర్ జెట్ ఒకటి ధ్వంసమైన మాట వాస్తవమేనని అంగీకరించింది. అయితే, అది స్వల్పమేనని పేర్కొనడం గమనార్హం. పాక్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధరీ.. తమ దేశ ఎయిర్‌ఫోర్స్, నేవీ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. "భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణల్లో మన వాయుసేనకు చెందిన ఓ యుద్ధ విమానం స్వల్పంగా ధ్వంసమైంది" అని వెల్లడించారు. అయితే, ఆ నష్టం ఏ స్థాయిలో ఉందనే విషయంపై పూర్తి వివరాలను ఆయన బయటపెట్టలేదు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ సాధించిన విజయాలను మన సైన్యం ఆదివారం వెల్లడించింది. పాక్ విమానాలను నేల కూల్చామని ఎయిర్ మార్షల్ ఎ.కె.భారతి తెలిపారు. అయితే, ఆ సంఖ్య ఎంత అన్నది ఆయన చెప్పలేదు. "మన సరిహద్దు లోపలికి పాక్ యుద్ధవిమానాలను రాకుండా నిరోధించాం. కాబట్టి వాటి శకలాలు మా దగ్గర లేవు. కాకపోతే కచ్చితంగా కొన్ని విమానాలను కూల్చాం" అని తెలిపారు.

## సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో జీసీసీ హబ్‌గా హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ జీసీసీ హబ్‌గా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందన్నారు. కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించినట్లు చెప్పారు. మరిన్ని ప్రపంచస్థాయి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని వివరించారు. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో అందరి సహకారం కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

## ఆర్టీఐ కమిషనర్లను నియమించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: సమాచార హక్కుచట్టం (ఆర్టీఐ) కమిషనర్లుగా నలుగురిని తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఆర్టీఐ కమిషనర్లుగా పీవీ శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## భారత్, పాక్ చర్చలు వాయిదా.. మోదీ-దోభాల్ ప్రత్యేక భేటీ



భారత్-పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది. ఈ ఒప్పందం, అనంతర పరిస్థితిపై ఇరుదేశాల మధ్య కీలక చర్చలు జరగాల్సి ఉండగా.. ప్రస్తుతం అవి వాయిదా పడ్డాయి. ఈ సాయంత్రం 5 గంటలకు ఈ చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు దేశాల 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో)ల మధ్య హాట్‌లైన్‌లో చర్చలు జరుగుతాయి. అయితే, వాయిదాకు గల కారణాలు తెలియరాలేదు.

మరోవైపు, ప్రధాని మోదీ నివాసంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, త్రివిధ దళాల అధిపతులు, పలువురు ఉన్నతస్థాయి సైనికాధికారులు సమావేశమయ్యారు.

**మోదీ-దోభాల్ ప్రత్యేక సమావేశం..** తన నివాసంలో జరిగిన కీలక సమావేశం అనంతరం మోదీతో అజిత్ దోభాల్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారత్, పాక్ చర్చల నేపథ్యంలో వివిధ అంశాలపై వీరు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే.. డీజీఎంవో చర్చల నేపథ్యంలో ఆదివారం మోదీ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ బుల్లెట్లకు ఫిరంగి గుళ్లతో సమాధానం ఇవ్వాలని భారత సైన్యాన్ని ఆదేశించారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు అప్పగించడం మినహా కశ్మీర్ అంశంపై పాక్‌తో ఎలాంటి చర్చలు ఉండవని ప్రధాని స్పష్టం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కశ్మీర్ అంశంలో ఎవరి మధ్యవర్తిత్వమూ అవసరం లేదని తేల్చి చెప్పాయి. ప్రస్తుతం భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ వెంబడి ప్రశాంత వాతావరణం నెలకొంది.

## కశ్మీర్ అంశంపై మూడో దేశం మధ్యవర్తిత్వం నిజమేనా?: కాంగ్రెస్



భారత్- పాక్‌ల మధ్య కొనసాగిన ఉద్రిక్తతలకు కాల్పుల విరమణ ఒప్పందంతో తెరపడిన సంగతి తెలిసిందే. తమ మధ్యవర్తిత్వంతోనే ఇది జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈనేపథ్యంలో కశ్మీర్ అంశంపై అగ్రరాజ్య ప్రమేయం నిజమేనా అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వ స్పష్టంచేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మన దేశ విదేశీ విధానంలో ఏమైనా మార్పులు చోటుచేసుకున్నాయా?. భారత్- పాక్‌ల మధ్య ఉన్న కశ్మీర్ అంశంపై మధ్యవర్తిత్వానికి మూడో పక్షాన్ని అనుమతించి శిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించారా?. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ విషయంలో తన జోక్యం ఉందని పేర్కొంటూ ప్రతిరోజూ ప్రకటనలు చేస్తున్నారు. వీటిపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఈ అంశాలపై చర్చించడానికి పార్లమెంటును అత్యవసరంగా సమావేశపరచాలని ప్రధాని మోదీని ఇప్పటికే కోరాం. ఇది పరిస్థితిని అంచనా వేయడానికే తప్ప.. ఒకరిని నిందించడానికి కాదు. ఏమైనా తప్పులు జరిగిఉంటే అవి భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసుకోవాలి' అని ఆయన పేర్కొన్నారు. భారత్- పాక్‌ల మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. దీనికి ముందే తమ మధ్యవర్తిత్వంతోనే ఇది జరిగిందంటూ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. దీంతో కాల్పుల విరమణలో అమెరికా పాత్రపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ విషయంపై ప్రధానికి వేర్వేరుగా లేఖలు కూడా రాశారు. ఈ అంశాలపై తక్షణం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరచాలని వారు అందులో కోరారు.




## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత.. పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి..

హైదరాబాద్: హైదరాబాద్ అడ్డాగా మరోసారి భారీ డ్రగ్స్ దందా వెలుగులోకి వచ్చింది. డ్రగ్స్‌పై తెలంగాణ పోలీసులు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా నిందితులు వేర్వేరు దారుల్లో తరలిస్తునే ఉన్నారు. తాజాగా ఉప్పల్‌లో భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఇవాళ(సోమవారం) మీడియాకు ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి వెల్లడించారు. ఉప్పల్‌లో 106 కిలోల గంజాయి సీజ్ చేసుకున్నామని ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. ఉప్పల్ హెచ్‌సీఎల్ ప్రాంతంలో ఒక గోదాంలో నిందితులు గంజాయి నిల్వ చేశారని చెప్పారు. పక్కా సమాచారంతో గంజాయి సీజ్ చేశామని.. ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. 106 కేజీల గంజాయిని 56 ప్యాకెట్‌లలో నిందితులు ప్యాక్ చేశారని అన్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ.53 లక్షలు ఉంటుందని తెలిపారు. ఒక్కో ప్యాకెట్‌లో రెండు కేజీల గంజాయిని నింపారని చెప్పారు. ఈ కేసులో కట్ల వివేక్ రెడ్డి, మధు కిరణ్‌లను అరెస్టు చేశామని అన్నారు. వివేక్‌రెడ్డి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారని ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి చెప్పారు. ఈ ఇద్దరు ఇచ్చిన సమాచారం మేరకు మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన రాంబాబును ప్రధాన నిందితుడిగా గుర్తించామని ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. రాంబాబు పరారీలో ఉన్నాడని.. అతని కోసం గాలిస్తున్నామని చెప్పారు. రాంబాబు మల్కాన్‌గిరి నుంచి నిందితులకు గంజాయి పంపుతారని తెలిపారు. కట్ల వివేక్‌రెడ్డి, మధు కిరణ్ ఈ గంజాయిని హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చేర వేస్తారని చెప్పుకొచ్చారు. తాను పంపిన గంజాయి స్టాక్‌ను క్లియర్ చేసినందుకుగాను రాంబాబు ఇద్దరు నిందితులకు రూ.50 వేలు ఇస్తాడని ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. రాంబాబును ఇంకా అదుపులోకి తీసుకోలేదని.. ఆయనను విచారించిన తర్వాత కీలక సమాచారం వెలుగులోకి వస్తుందని ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. వివేక్‌పై ఆల్రెడీ రెండు కేసులు ఉన్నాయని.. రాంబాబుపై భద్రాచలంలో రెండు కేసులు ఉన్నాయని వివరించారు. మల్కాన్‌గిరి అటవి ప్రాంతంలో గంజాయిని ప్రత్యేకంగా ప్యాక్ చేస్తారని తెలిపారు. మల్కాన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు వివిధ మార్గాల్లో గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నారని ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి వెల్లడించారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com